RNI : APTEL/25/A0108

www.mahinewsindia.com

# మహి న్యూస్

తెలుగు దినపత్రిక

epaper: https://epaper.mahinewsindia.com

**విలేకరులు కావలెను**

మహి న్యూస్ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 25, ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజీలు : 8, వెల రూ. 2, /- మంగళవారం - 28 - ఏప్రిల్ - 2026

published From : YSR Kadapa. circulated by Kurnool I Anantapuram I Chitoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad and Telangana

## ఇంధన కొరత ఏర్పడినందుకు చంద్రబాబు సిగ్గుపడాలి

- సమీక్షలు, సలహాలతో ఇంధన కొరత తీరదన్న షర్మిల



- రాష్ట్రంలో 70 శాతం బంకులు మూతపడ్డాయని వ్యాఖ్య
- కూటమి ప్రభుత్వ పాలనా వైఫల్యమని ఆరోపణ

## హైదరాబాద్ అభివృద్ధికి 'హెచ్-సిటీ' పేరిట ప్రభుత్వ కొత్త ప్రణాళిక

హైదరాబాద్‌లో ట్రాఫిక్‌కు చెక్.. రూ.7,042 కోట్లతో 'హెచ్-సిటీ'



మౌలిక వసతుల కోసం రూ.7,042 కోట్లకు పరిపాలనా అనుమతులు

కేబీఆర్ పార్కు వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రూ.1,090 కోట్లు

ముగింపు దశకు నల్గొండ ఎక్స్ రోడ్స్-ఐఎస్ సదన్ ఫ్లైఓవర్ పనులు

## బీజేపీ సీఎం ప్రమాణ స్వీకారానికి బెంగాల్ వస్తా

- దేశ ప్రజలే తన కుటుంబమని వెల్లడి



- టీఎంసీ హయాంలో నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని విమర్శలు

ఢిల్లీ: మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని మిగతా..2లో




## విశాఖలో ఘనంగా ప్రారంభమైన ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు

- విశాఖలో అట్టహాసంగా ఏయూ శతాబ్ది ఉత్సవాలు.. ప్రముఖులతో వెలిగిపోయిన వేదిక
- పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, గవర్నర్లు, ప్రజాప్రతినిధుల హాజరు
- వేడుకల్లో పాల్గొన్న క్రికెట్ దిగ్గజం సచిన్, ఏయూ పూర్వ విద్యార్థి, సినీ దర్శకుడు త్రివిక్రమ్

అమరావతి: శత వసంతాల చారిత్రక ప్రస్థానానికి గుర్తుగా, ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) శతాబ్ది ఉత్సవాలు విశాఖపట్నంలో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. దేశానికి ఎందరో మేధావులను, రాజకీయ ప్రముఖులను, ఉన్నతాధికారులను అందించిన ఈ సరస్వతీ నిలయం వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఈ వేడుకలకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికైంది. విద్యార్థులు, పూర్వ విద్యార్థుల కేరింతలతో ప్రాంగణం మొత్తం పండుగ వాతావరణంలో మిగతా..2లో



## ఆంధ్రా యూనివర్సిటీ దేశానికే తలమానికం

ఏయూ వందేళ్ల వేడుకలు... వేదికపై నుంచి చంద్రబాబుకు నారా లోకేశ్ విజ్ఞప్తి

ఏయూ పరిశోధనల కోసం రూ.250 కోట్లు కేటాయించాలని సీఎంను కోరిన లోకేశ్

అమరావతి: ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ) పరిశోధనల అభివృద్ధికి రూ.250 కోట్లు కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆంధ్రా యూనివర్సిటీ శత వసంతాల మిగతా..2లో

# స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 నిర్మాణమే లక్ష్యం

## విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌కు నేడు శంకుస్థాపన చేయనున్నట్టు వెల్లడి

- ఆంధ్రా యూనివర్సిటీకి చంద్రబాబు బొనాంజా... వర్సిటీ వందేళ్ల వేడుకలో సీఎం ప్రసంగం
- ఆంధ్రా యూనివర్సిటీకి రూ.500 కోట్ల నిధులను ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రపంచ టాప్ 100, దేశంలో టాప్ 5 యూనివర్సిటీలలో ఏయూ ఒకటిగా నిలవాలని ఆకాంక్ష
- పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ సహకారంతో స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 నిర్మిస్తామని ప్రకటన




అమరావతి: ఆంధ్రా యూనివర్సిటీని ప్రపంచంలోని టాప్ 100, దేశంలోని టాప్ 5 విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా నిలపాలన్నదే తన లక్ష్యమని, ఇందుకు తొలి విడతగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.500 కోట్ల నిధులను మంజూరు చేస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతా..2లో



## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం

- బీఆర్ఎస్ రాష్ట్ర స్థాయి కమిటీ మినహా అన్నీ కమిటీలు రద్దు
- పార్టీ వర్కింగ్ ప్రెసిండెంట్ కేటీఆర్‌కు కీలక బాధ్యతలు
- త్వరలో అన్నీ స్థాయిల కమిటీలు నియమించాలి
- కాంగ్రెస్‌ది చిల్లర ప్రభుత్వం'

## బీఆర్ఎస్ పార్టీకి గతం ఉంది..

# భవిష్యత్ లేదు

## చచ్చిన శవానికి ఎంత అలంకరణ చేసినా వేస్ట్ అన్న రేవంత్

- వాళ్లు తెచ్చిపెట్టుకున్న నటనను ప్రదర్శిస్తున్నారు
- ఉద్యమం అప్పుడు ఎలా మాట్లాడినా ప్రజలు సహించారు. అధికారంలో ఉన్న పదేళ్లు కూడా అలాగే మాట్లాడారు.
- ఆయన చావును నేనెందుకు కోరుకుంటా. ఆయన ఆరోగ్యంగా ఉంటేనే మాకు మంచిది
- ఆయన మర మనిషో కాదో.. కుటుంబ సభ్యులకే తెలుసు



హైదరాబాద్ : కొత్త పార్టీని పక్కన పెట్టండి. ఉన్న పార్టీ ఉంటుందో.. ఊడుతుందో. బీఆర్ఎస్‌కు గతం ఉంది.. భవిష్యత్తు లేదు. కేసీఆర్ నా రాజకీయ ప్రత్యర్థి.. నాకు శత్రువు కాదు' మిగతా..2లో



## బీఆర్ఎస్ రాజకీయ

# పార్టీ కాదు..

## ఒక విప్లవమన్న కేటీఆర్

- బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం.. 'ఎక్స్' వేదికగా కేటీఆర్, హరీశ్ రావు ట్వీట్
- నెత్తురు మండి ఒక జాతి ఎత్తిన జెండా పాతికేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుందని వ్యాఖ్య
- తెలంగాణ జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిందన్న హరీశ్ రావు

హైదరాబాద్: బీఆర్ఎస్ రాజకీయ పార్టీ కాదని, ఇది ఒక విప్లవమని ఆ పార్టీ వర్కింగ్ మిగతా..2లో

## లోక్‌సభలో మా ఎంపీలే ఉంటే..

# రణరంగం సృష్టించేవాళ్లు

## రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయింది

- ప్రభుత్వానికి ధాన్యం కొనడం చేత కావట్లేదు
- "రాష్ట్రంలో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు
- తెలంగాణ గురించి ఎంపీ తేజస్వి సూర్య ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు
- కాళేశ్వరంపై రాజ్యసభలో సీఆర్ పాటిల్ మాట్లాడితే సురేశ్‌రెడ్డి గట్టిగా ఖండించారు



హైదరాబాద్: రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయిందని మాజీ సీఎం, మిగతా..2లో



## దేశంలోని అన్ని ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

ఢిల్లీ: మహారాష్ట్రలోని అకోలా జిల్లాలో దేశంలోనే అత్యధికంగా 46.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగ్‌పూర్, విదర్భలోని పలు ప్రాంతాల్లో తీవ్రమైన వేడిగాలులు వీచాయి. ఈ సంవత్సరం మార్చి నెల నుంచే ఎండలు మండిపోతున్నాయి. ఈ ఏప్రిల్ నెలలో ఉష్ణోగ్రతలు దాదాపు అన్ని ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటాయి. దీనితో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు మిగతా..2లో

## ఏపీలో ఇంధన కొరతపై చంద్రబాబు

# మరోసారి టెలీకాన్ఫరెన్స్

## రాష్ట్రంలో ఇంధన కొరతపై సీఎం చంద్రబాబు సమీక్ష

క్షేత్రస్థాయిలో సరఫరాను పర్యవేక్షించాలని కలెక్టర్లకు ఆదేశం

ప్రతీ 3 గంటలకు నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులకు సూచన

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



అమరావతి: రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు ఆయన సోమవారం నాడు కూడా ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మిగతా..2లో



## ఢిల్లీ మెడలు వంచిన పార్టీ బీఆర్ఎస్

- కాంగ్రెస్, బీజేపీ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పిస్తాం: కేటీఆర్
- పదేళ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణను అగ్రభాగన నిలపెట్టారని ఉద్ఘాటన

హైదరాబాద్: కాంగ్రెస్, బీజేపీ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించి మళ్లీ బీఆర్ఎస్‌ను పట్టాలెక్కించేందుకు పోరాటం చేస్తామని మిగతా..2లో

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక



# విశాఖలో ఘనంగా ప్రారంభమైన ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు

మొదటి పేజీ తరువాయి

విద్యార్థులు, పూర్వ విద్యార్థుల కేరింతలతో ప్రాంగణం మొత్తం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. ఈ చారిత్రక ఘట్టానికి ముఖ్య అతిథిగా భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఒడిశా గవర్నర్ కె. హరిబాబు, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాస వర్మ, విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్, పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి, ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కూడా ఈ వేడుకల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా, ఆంధ్ర విశ్వవిద్యాలయం వందేళ్ల ఘనతకు గుర్తుగా ప్రత్యేక పోస్టల్ స్టాంపును ఆవిష్కరించారు. వర్సిటీ అభివృద్ధి పనులను కూడా ఇదే వేదిక నుంచి ప్రారంభించారు. పరిశోధనలకు ఆయువుపట్టుగా, ఎన్నో ఆవిష్కరణలకు వేదికగా నిలిచిన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఘన చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే లక్ష్యంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల కోసం సుమారు 25 వేల మందికి పైగా ప్రస్తుత, పూర్వ విద్యార్థులు తరలివచ్చారు. వారి కోసం మూడు భారీ జర్మన్ షెడ్లను ఏర్పాటు చేసి, 36 విభాగాలుగా సీటింగ్ ఏర్పాట్లు చేశారు. ప్రధాన వేదికకు ఇరువైపులా ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్లు, ఆకర్షణీయమైన అలంకరణలతో ప్రాంగణం కొత్త కాంతులతో వెలిగిపోయింది. ఈ శతాబ్ది ఉత్సవాలు విశ్వవిద్యాలయ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోనున్నాయి.

# బీజేపీ సీఎం ప్రమాణ స్వీకారానికి బెంగాల్ వస్తా

ఢిల్లీ: మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి తాను తిరిగి బెంగాల్ వస్తానని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో నేడు బారక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన చివరి ర్యాలీలో మాట్లాడుతూ, బీజేపీ అధికారంలోకి వస్తుందనే ఉత్సాహంతో తాను ఢిల్లీకి వెళుతున్నానని అన్నారు. తాను హెలిప్యాడ్ దిగి వస్తుంటే దాదాపు 2 కిలోమీటర్ల మేర ప్రజలు ఎదురుచూస్తూ ఉన్నారని తెలిపారు. తనను ఆశీర్వదించడానికి ఇంతమంది ప్రజలు వస్తారని ఊహించలేదని అన్నారు. రాజకీయాల్లోకి వచ్చి బీజేపీలో చేరిన తర్వాత ఒక కార్యకర్తగా పార్టీ ఏది చేయమన్నా అది చేశానని అన్నారు. తనకు ప్రత్యేకంగా ఒక కుటుంబం అంటూ లేదని, దేశ ప్రజలే తన కుటుంబమని వ్యాఖ్యానించారు. గత నాలుగు దశాబ్దాలుగా తాను దేశంలోని ప్రతి ప్రాంతంలో పర్యటిస్తున్నానని మోదీ అన్నారు. ఈ రోడ్డు షోలే తనకు పుణ్యయాత్రలని వ్యాఖ్యానించారు. నాడు టీఎంసీ అధికారంలోకి రావడానికి కారణమైన 'మా-మాటి-మనుష్' నినాదాన్ని వారు వదిలివేశారని ఆరోపించారు. ఎన్నికల ప్రచారం సమయంలో వారు ఒక్కసారి కూడా ఈ నినాదాన్ని ప్రస్తావించకపోవడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. ఆ పార్టీ నేతలు రాష్ట్రాభివృద్ధిని పక్కన పెట్టి దూషణలు, బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. టీఎంసీ పాలనలో మహిళలపై గతంలో ఎన్నడూ లేనివిధంగా దాడులు జరిగాయని మండిపడ్డారు. నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే నిందితులను వదిలిపెట్టేది లేదని ప్రధాని మోదీ అన్నారు.

# ఇంధన కొరత ఏర్పడినందుకు చంద్రబాబు సిగ్గుపడాలి

అమరావతి: రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్రంగా స్పందించారు. కేవలం సమీక్షలు, సలహాలతో ఇంధన కొరత తీరదని, 24 గంటల డెడ్ లైన్‌తో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 70 శాతం బంకులు మూతపడటం అత్యంత దారుణమని, దీనిని అత్యవసర పరిస్థితిగా గుర్తించి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. "దేశంలో ఎక్కడా లేని ఇంధన కొరత ఏపీలోనే ఏర్పడినందుకు చంద్రబాబు సిగ్గుపడాలి. ప్రజలను ఎర్రటి ఎండలో కిలోమీటర్ల మేర నిలబెట్టడం కూటమి పాలనా వైఫల్యానికి నిదర్శనం" అని షర్మిల మండిపడ్డారు. మోదీకి మద్దతు ఇచ్చి ప్రధాని పీఠంపై కూర్చోబెట్టినా రాష్ట్రానికి ఇంధన కష్టాలు రావడం బాధాకరమన్నారు. ఇంధన కొరత వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే ప్రమాదం ఉందని, ప్రభుత్వం వెంటనే నిద్రమత్తు వీడాలని హెచ్చరించారు.

# ఆంధ్రా యూనివర్సిటీ దేశానికే తలమానికం

మొదటి పేజీ తరువాయి

ఆంధ్రా యూనివర్సిటీ శత వసంతాల వేడుకల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "అడగందే అమ్మయినా అన్నం పెట్టదు అంటారు. అందుకే ఈ సభా వేదిక నుంచి సీఎం గారిని కోరుతున్నా. ఏయూలో పరిశోధన రంగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు రూ.250 కోట్లు కేటాయించాలి" అని కోరారు. ప్రధాని మోదీ చెప్పినట్లుగా రీసెర్చ్ రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు.

ఓటమి నుంచి గెలుపు వరకు..

ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని, ఎదుర్కొన్న సవాళ్లను లోకేశ్ విద్యార్థులతో పంచుకున్నారు. "నేను 'నో రిస్క్ నో స్టోరీ' అనే సిద్ధాంతాన్ని నమ్ముతాను. 2019లో తొలిసారి మంగళగిరిలో పోటీ చేసి ఓడిపోయినప్పుడు ఎంతో వేదనకు గురయ్యాను. కానీ ఆ ఓటమి తర్వాత మరింత కసితో పనిచేశాను. దాని ఫలితంగానే 2024 ఎన్నికల్లో 91 వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందాను. ఈ వేదికపై ఉన్న మహోన్నత వ్యక్తుల జీవితాల్లో కూడా ఎన్నో త్యాగాలు, కృషి ఉన్నాయి. అందుకే వారు ఈ స్థాయిలో ఉన్నారు" అని వివరించారు.

ఏయూ దేశానికే తలమానికం..

ఆంధ్రా యూనివర్సిటీ చరిత్రను, ప్రాముఖ్యతను లోకేశ్ కొనియాడారు. "ప్రముఖ దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడిన తర్వాత మనం మాట్లాడడం చాలా కష్టం. దేశంలోని ప్రాచీన విశ్వవిద్యాలయాల్లో ఏయూ ఒకటి. దీని స్థాపన వెనుక ఎంతోమంది మహానుభావుల త్యాగం, కృషి ఉన్నాయి. ఫిజిక్స్ నుంచి పాలిటిక్స్ వరకు ప్రతి రంగంలోనూ ఏయూ తనదైన ముద్ర వేసింది. ఇక్కడి పూర్వ విద్యార్థులు ఎందరో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. వెంకయ్యనాయుడు వంటి అనేకమంది రాజకీయ ప్రముఖులు ఇక్కడే చదివారు. మన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కూడా ఈ వర్సిటీ విద్యార్థే. ఈ వర్సిటీలో చదవనందుకు నేను ఎంతో బాధపడుతున్నాను" అని అన్నారు.

అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలు

రాష్ట్ర విభజన తర్వాత తొలి క్యాబినెట్ సమావేశం ఏయూలోనే జరిగిందని లోకేశ్ గుర్తు చేశారు. వర్సిటీలకు విజన్ ఉన్న వీసీలు ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. వర్సిటీలు కాలానుగుణంగా తమ కరిక్యులమ్‌ను మార్చుకోవాలని, భవిష్యత్తులో ఏయూ విద్యార్థులు రాజకీయాల్లోకి కూడా రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడుల గురించి మాట్లాడుతూ.. "రేపు గూగుల్‌కు శంకుస్థాపన చేయబోతున్నాం" అని వెల్లడించారు. వందేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం అనేది ఒక వర్సిటీ చరిత్రలో అరుదైన ఘట్టమని, ఏయూ రాష్ట్రానికే కాక దేశానికే తలమానికం అని ప్రశంసించారు.

# దేశంలోని అన్ని ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

దీనితో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఈ వారం మొత్తం దేశంలోని అనేక ప్రాంతాల్లో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని నాగ్‌పూర్‌లోని వాతావరణ శాఖ తెలిపింది. ఈ సంవత్సరం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 నుంచి 46 డిగ్రీల వరకు చేరుకోవచ్చని, కొన్ని ప్రాంతాల్లో 47 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం దేశంలోనే అత్యధికంగా అకోలాలో 46.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు తెలిపింది. అమరావతి (మహారాష్ట్ర)లో 46.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వెల్లడించింది. వాతావరణ శాఖ డేటా ప్రకారం, వార్ధాలో 46.4 డిగ్రీలు, యవత్మాల్‌లో 46 డిగ్రీలు, నాగ్‌పూర్‌లో 45.4 డిగ్రీలు, చంద్రాపూర్‌లో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. విదర్భ ప్రాంతంలో తీవ్రమైన వడగాలులు వీచాయని తెలిపింది. ఈ ప్రాంతంలో మంగళవారం వరకు ఈ వడగాలుల ప్రభావం ఉంటుందని హెచ్చరించింది. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మధ్యాహ్న సమయాల్లో బయటకు రాకూడదని అధికారులు సూచించారు.

# ఢిల్లీ మెడలు వంచిన పార్టీ బీఆర్ఎస్

మొదటి పేజీ తరువాయి

పోరాటం చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అడుగడుగునా పోరాటాలు చేస్తూ ఢిల్లీ మెడలు వంచిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పదేళ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణను అగ్రభాగాన నిలబెట్టారని అన్నారు. 14 సంవత్సరాల పాటు తెలంగాణ కోసం కేసీఆర్ పోరాటం చేశారని, ఆ తర్వాత పదేళ్లు మంచి పాలన అందించారని అన్నారు. దశాబ్దాలుగా దగాపడ్డ తెలంగాణ కోసం అన్ని పదవులు వదులుకొని, 25 సంవత్సరాల క్రితం ఇదే రోజు జలదృశ్యంలో కేసీఆర్ పార్టీని స్థాపించారని తెలిపారు. తెలంగాణ కోసం కేసీఆర్ ఉద్యమించి, తెలంగాణ ప్రజలను, జాతిని ఐక్యం చేసి ఢిల్లీ మెడలు వంచారని అన్నారు. తెలంగాణను సాధించాక ప్రజలు అధికారం ఇస్తే, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగాన పెట్టిన నాయకుడు కేసీఆర్ అన్నారు. ప్రస్తుతం ఈ రెండున్నరేళ్ళలుగా ఈ దుర్మార్గపు పాలనలో అణచివేతలకు గురవుతున్న ప్రజలకు బీఆర్ఎస్ గొంతుకై నిలుస్తోందని అన్నారు. ఉద్యమ పార్టీగా, 10 ఏళ్లు అధికార పార్టీగా, రెండున్నరేళ్లు ప్రతిపక్ష పార్టీగా ప్రజలు ఇచ్చిన ప్రతి పాత్రను బీఆర్ఎస్ సమర్థవంతంగా పోషిస్తోందని అన్నారు.

# స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 నిర్మాణమే లక్ష్యం

అమరావతి: ఆంధ్రా యూనివర్సిటీని ప్రపంచంలోని టాప్ 100, దేశంలోని టాప్ 5 విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా నిలపాలన్నదే తన లక్ష్యమని, ఇందుకు తొలి విడతగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.500 కోట్ల నిధులను మంజూరు చేస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ 100 సంవత్సరాల ఉత్సవాల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అభివృద్ధికి తన దార్శనికతను, ప్రభుత్వ ప్రణాళికలను ఆవిష్కరించారు.

విశాఖ అభివృద్ధి అన్‌స్టాపబుల్

విశాఖ నగరం రేపటి నుంచి గ్లోబల్ సిటీగా మారబోతోందని, దీని అభివృద్ధి ఇక అన్‌స్టాపబుల్ అని చంద్రబాబు అన్నారు. నగరానికి రానున్న అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్‌కు మంగళవారం శంకుస్థాపన చేయనున్నట్టు వెల్లడించారు. యూనివర్సిటీలో ఇప్పటికే రూ.64 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించినట్టు తెలిపారు. విద్యాలయాలు కేవలం డిగ్రీలు, పట్టాలు ఇచ్చే కేంద్రాలుగా కాకుండా, నూతన ఆవిష్కరణలకు వేదికగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. సచిన్ టెండూల్కర్ చెప్పినట్టుగా, విశాఖ సముద్ర తీరంలోని ప్రశాంత వాతావరణం ఎంతో శక్తిని ఇస్తుందని అన్నారు.

యువతకు స్ఫూర్తిదాయక సందేశం

"చాలామంది నా వయసు 76 అంటారు, కానీ నేనెప్పుడూ అలా అనుకోను. నా ఆలోచనలు 26 ఏళ్ల వ్యక్తిలా ఉంటాయి" అంటూ యువతను ఉత్తేజపరిచారు. గతంలో తాను ఐటీని తీసుకొస్తే, ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం టెక్నాలజీల గురించి మాట్లాడుతున్నామని, భవిష్యత్ సాంకేతికతపై దృష్టి సారించాలని సూచించారు. "నాలెడ్జ్, ఇన్నోవేషన్, టెక్నాలజీపై దృష్టి పెడితే సాధారణ వ్యక్తులు కూడా అసాధారణ విజయాలు సాధించవచ్చు. మీరు ఉద్యోగాలు చేయడం కాదు, వందల మందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి. అందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది," అని భరోసా ఇచ్చారు.

ఏయూ ఘన చరిత్ర.. పూర్వ విద్యార్థులకు పిలుపు

ఆంధ్రా యూనివర్సిటీకి వందేళ్ల ఘన చరిత్ర ఉందని, దీనికి తొలి వీసీ కట్టమంచి రామలింగారెడ్డి బలమైన పునాదులు వేయగా, రెండో వీసీ సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఎదిగారని గుర్తుచేశారు. ఈ వర్సిటీ రచయితలకు, కళాకారులకు 'కళాప్రపూర్ణ' బిరుదులిచ్చి గౌరవించిందని, ప్రస్తుతం 58 దేశాల విద్యార్థులు ఇక్కడ చదువుకోవడం గర్వకారణమని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.500 కోట్లకు అదనంగా, పూర్వ విద్యార్థులు, దాతలు మరో రూ.500 కోట్లు సమీకరించాలని పిలుపునిచ్చారు. ఇక్కడే చదివిన గ్రంథి మల్లికార్జునరావు వంటి దిగ్గజాలు తల్చుకుంటే ఇది అసాధ్యం కాదని ఆశాభావం వ్యక్తం చేశారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 నిర్మాణమే లక్ష్యం

తాను, తన మిత్రుడు పవన్ కల్యాణ్ కలిసి ప్రధాని నరేంద్ర మోదీ పూర్తి సహకారంతో ఈ రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయడానికి కట్టుబడి ఉన్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రధాని సంకల్పం 'వికసిత భారత్ 2047' అయితే, తమ సంకల్పం 'స్వర్ణాంధ్రప్రదేశ్ 2047' అని పునరుద్ఘాటించారు. ఆ సంకల్ప సాధన కోసం జైత్రయాత్రను ఈ ఆంధ్రా యూనివర్సిటీ నుంచే ప్రారంభిస్తున్నామని ఆయన ఉద్ఘాటించారు. పిల్లలకు ఇచ్చే అసలైన ఆస్తి చదువేనని, దానిని అందించడంలో ప్రభుత్వం వెనకడుగు వేయదని హామీ ఇచ్చారు.

# బీఆర్ఎస్ పార్టీకి గతం ఉంది.. భవిష్యత్ లేదు : రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ : కొత్త పార్టీని పక్కన పెట్టండి. ఉన్న పార్టీ ఉంటుందో.. ఊడుతుందో. బీఆర్ఎస్‌కు గతం ఉంది.. భవిష్యత్తు లేదు. కేసీఆర్ నా రాజకీయ ప్రత్యర్థి.. నాకు శత్రువు కాదు' అని అన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. రాష్ట్రంలో ఇటీవల రాజకీయ పరిణామాలపై ఆయన సోమవారం మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఆ చిట్‌చాట్‌లో మాజీ ఎమ్మెల్సీ కవిత ఏర్పాటు చేసిన కొత్త పార్టీ తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్), బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 'కొత్త పార్టీ పక్కన పెడితే.. ఉన్న పార్టీ ఉంటుందో.. ఊడుతుందో. బీఆర్ఎస్‌కు గతం ఉంది. భవిష్యత్తు లేదు. ఇప్పుడు ఎలిమినేషన్ ప్రాసెస్ నడుస్తోంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నా రాజకీయ ప్రత్యర్థి. శత్రువు కాదు' అని వ్యాఖ్యానించారు. ప్రతి పనికి పర్పస్ ఉంటుంది.. పర్పస్ అయిపోయాక దాంతో పనేముండదు. కేసీఆర్ పార్టీ మనుగడ ముగిసింది. చనిపోయిన శవానికి ఎంత అలంకరణ చేసినా మనిషి లేచి రాడు. బీఆర్ఎస్ పార్టీ చనిపోయిన శవంతో సమానం. బీఆర్ఎస్‌కు గతం ఉంది.. భవిష్యత్ లేదు.. ఉండదు. తెలంగాణ ఉద్యమంలో ఏం చేసినా చెల్లింది. దాడులు చేసినా, అవమానించినా పడ్డారు.. ఇప్పుడు కూడా అలా ఉంటామంటే కుదరదు. పదేళ్ల అధికారంలో అహంభావం, అధికారం తలకెక్కింది. అహంకారం పెరగడంతో 2023లో బీఆర్ఎస్‌ను ఓడగొట్టారు. ఆ తర్వాత వచ్చిన ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చారు. కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్‌తో ప్రజలకు సంబంధాలు తెగిపోయాయి. ఇప్పుడు పడే తాపత్రయం అంతా కుటుంబం కోసమే. కుటుంబ పంచాయితీల్లో వచ్చిన కొత్త సంస్థలను మాపై రుద్దకండి. ఒక్క చెరువు నుంచి వచ్చిన నీటికి రంగు రుచి మారదు.

శవాన్ని ఎంత అలంకరించినా లేచి నిలబడదు..!

కేసీఆర్ ఆరోగ్యం బాగాలేదు అనగానే పరామర్శించా. అసెంబ్లీకి కేసీఆర్ వస్తే యోగక్షేమాలు కనుక్కున్నది నేను. హిందూ సమాజంలో కుటుంబ పెద్ద చనిపోతే వారసులకు వారసత్వం వస్తుంది. ఔరంగజేబు వారసత్వం కోసమే అందరినీ చంపేశాడు. ఒకరు చనిపోవాలని నేను ఎందుకు కోరుకుంటా. వాళ్లు చనిపోతే ఆ పార్టీ, ఆపార్టీ ఆస్తులు నాకు రావు. కేసీఆర్ నా రాజకీయ ప్రత్యర్థి. నాకు శత్రువు కాదు. 2023 నుంచి అన్నీ ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించాను. కేసీఆర్ మీద నాకు గెలుపు కొత్తకాదు'అని అన్నారు.

# లోక్‌సభలో మా ఎంపీలే ఉంటే.. రణరంగం సృష్టించేవాళ్లు : కేసీఆర్

హైదరాబాద్: రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయిందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ప్రభుత్వానికి ధాన్యం కొనడం చేత కావట్లేదని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడారు. "రాష్ట్రంలో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు. తెలంగాణ గురించి ఎంపీ తేజస్వి సూర్య ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్, భాజపా ఎంపీలు ఒక్కమాట మాట్లాడలేదు. బీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో ఉండి ఉంటే రణరంగం సృష్టించేవాళ్లు. కాళేశ్వరంపై రాజ్యసభలో సీఆర్ పాటిల్ మాట్లాడితే సురేశ్‌రెడ్డి గట్టిగా ఖండించారు. తెలంగాణ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్, భాజపా నేతలు ఏం చేస్తున్నారు?" అని ప్రశ్నించారు. "రాష్ట్ర విభజన సమయంలో.. హైదరాబాద్ విషయంలో రాజీ పడాలని సోనియా గాంధీ ఎన్నో సార్లు చెప్పారు. కానీ.. నేను ఎప్పుడూ రాజీ పడలేదు.. అది నా చిత్తశుద్ధి" అని కేసీఆర్ అన్నారు.

# బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం

తెలంగాణ భవన్: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర స్థాయి కమిటీ మినహా అన్నీ కమిటీలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. త్వరలో అన్నీ స్థాయిల కమిటీలు నియమించాలని ఆదేశించారు. కమిటీల నియామక బాధ్యతల్ని కేసీఆర్‌కు అప్పగించారు. కొత్త కమిటీలకు శిక్షణా తరగతులు నిర్వహించాలని సూచించారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేసీఆర్ మాట్లాడారు. తెలంగాణలో రైతుల పరిస్థితి దిగజారుతోంది. రాష్ట్రంలోని ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. ప్రభుత్వానికి ధాన్యం కొనడానికి చేతకావడం లేదు. కాంగ్రెస్‌ది చిల్లర ప్రభుత్వం'అని ధ్వజమెత్తారు. మరోవైపు, కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణపై చేసిన వ్యాఖ్యలపై కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తేజస్వి సూర్య ఒక వెధవ. ఆయన అలా మాట్లాడుతుంటే ఒక్కరూ నోరుమెదపలేదు. బీఆర్ఎస్ ఎంపీలు సభలో ఉంటే రణరంగం అయ్యేది. ఒక్క తెలంగాణ బీజేపీ ఎంపీ నోరు మెదపలేదు'అని అన్నారు.

# ఈసారి భీకర దాడే: ఇరాన్ వార్నింగ్



ఢిల్లీ: గల్ఫ్ దేశాలకు ఇరాన్ మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. తమ నుంచి నాలుగింతలు దాడి చూడాలనుకుంటేనే అమెరికా మద్దతు విషయంలో ముందుకెళ్లాలని, ఈ తరుణంలో జరిగే పరిమాణాలకు మీరే బాధ్యత వహించాలని ఇరాన్ హెచ్చరించింది. యుద్ధానికి సంబంధించి రెండో విడత శాంతి చర్చలు ఇంకా అనిశ్చితిలో ఉన్న నేపథ్యంలో తమ పొరుగు గల్ఫ్ దేశాలు ఏమైనా అమెరికాకు మద్దతు ఇస్తే మాత్రం ఈసారి తమ నుంచి భీకర దాడి చూడాల్సి వస్తుందని ఇరాన్ ఉపాధ్యక్షుడు ఎస్మాయిల్ సాగాబ్ ఎస్ఫహానీ హెచ్చరించారు. ప్రధానంగా హోర్ముజ్ జలసంధిలో కొనసాగుతున్న నిర్బంధం కారణంగా తమ మౌలిక వసతులు, ముఖ్యంగా చమురు బావులు, దెబ్బతింటే మాత్రం నాలుగు రెట్లు ప్రతిస్పందనకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ విషయంలో అమెరికాకు మద్దతు ఇవ్వాలని భావించే గల్ఫ్ దేశాలు కాస్త వెనక్కి తగ్గితేనే మంచిదని, లేని పక్షంలో తమ నుంచి ఈసారి వచ్చే ప్రతిస్పందన మీ ఊహకు కూడా అందదని ఎస్ఫహానీ ముందస్తు సంకేతాలు పంపారు. 'మా లెక్కలు వేరుగా ఉంటాయి. ఒక చమురు బావి అంటే నాలుగు చమురు బావుల నష్టం, అమెరికాకు మద్దతిస్తే మాకు భారీ నష్టాన్ని తేవడంలో మీ వంతు పాత్ర కూడా ఉందనే అనుకుంటాం. అందుకు ప్రతి స్పందన కూడా నాలుగింతలే ఉంటుంది' అని పేర్కొన్నారు. గత వారం, తన ట్రూత్ సోషల్ వేదికలో ట్రంప్.. ఇరాన్‌ను కూలిపోతున్న ఆర్థిక వ్యవస్థగా రాసుకొచ్చారు. ' ఇరాన్ ఆర్థికంగా కూలిపోతోంది. వారు హోర్ముజ్ జలసంధిని వెంటనే తెరవాలని కోరుకుంటున్నారు . నగదు కోసం ఆకలితో ఉన్నారు. రోజుకు 500 మిలియన్ డాలర్లు నష్టపోతున్నారు. సైన్యం, పోలీసులు జీతాలు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి' అని తెలిపారు.

# సహజీవనం చేసి, విడిపోయేటప్పుడు లైంగిక దాడి అంటే ఎలా?: సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ: పెళ్లి చేసుకుంటానని చెప్పి తనపై అత్యాచారం, లైంగిక దాడికి పాల్పడ్డాడని ఒక వ్యక్తిపై ఆరోపణలు చేస్తూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పరస్పర అంగీకారంతో కూడిన సహజీవనానికి, నేరపూరిత లైంగిక నేరాలకు మధ్య తేడాను కోర్టు నొక్కి చెప్పింది. ఒక బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తన సహజీవన భాగస్వామిపై సదరు మహిళ లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ పిటిషన్ వేసింది. పరస్పర అంగీకారంతో ఏర్పడిన ఆ బంధం వీగిపోయిన తర్వాత అది లైంగిక దాడి ఎలా అవుతుందని జస్టిస్ బీవీ నాగరత్న కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు సహజీవనానికి సంబంధించినదని, వివాహం కాకుండానే మహిళ బిడ్డకు కూడా జన్మనిచ్చిందని తెలిపారు. కానీ ఇప్పుడు ఆమె దాడి, అత్యాచారం అంటోందని అన్నారు. సమ్మతితో ఏర్పడిన బంధం చివరకు దాడిగా ఎలా మారిందని ప్రశ్నించారు. వివాహ ప్రస్తావన లేకుండా ఏర్పడిన బంధాల్లో ఉన్న సమస్యలు ఇవేనని, కొన్నేళ్లపాటు కలిసి ఉన్న ఆ మహిళ ఇప్పుడు ఫిర్యాదు చేయడమేమిటని ప్రశ్నించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది మాట్లాడుతూ, నిందితుడు ఆ మహిళను కలిసినప్పుడు ఆమె వయస్సు పద్దెనిమిది అని, అప్పుడు ఆమె ఒక వితంతువు అని కోర్టుకు తెలిపారు. అతడికి కూడా అప్పటికే పెళ్లి అయిపోయిందని, కానీ ఆ విషయాన్ని దాచిపెట్టి అతడు సంబంధాన్ని కొనసాగించాడని పేర్కొన్నారు. ఇతర మహిళలను కూడా అతడు ఇలాగే మోసం చేశాడని అన్నారు. అయితే, ఆమె పెళ్లి చేసుకోవడానికి బదులు కలిసి జీవించడానికి ఎందుకు అంగీకరించిందని ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రశ్నించారు. పరస్పర అంగీకారంతో కూడిన సంబంధం లైంగిక దాడి కాదని స్పష్టం చేశారు. అలాగే మహిళ పరిస్థితిపై న్యాయమూర్తి సానుభూతి వ్యక్తం చేశారు. ఆ బిడ్డ పోషణ కోసం భరణం కోరవచ్చని సూచించారు. ఈ సమస్యను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు.

# ఏపీలో ఇంధన కొరతపై చంద్రబాబు మరోసారి టెలీకాన్ఫరెన్స్

అమరావతి: రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు ఆయన సోమవారం నాడు కూడా ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంధన సరఫరాను సాధారణ స్థితికి తెచ్చేందుకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు తక్షణమే ఆయిల్ డిస్పాచ్ సెంటర్లకు స్వయంగా వెళ్లి సరఫరాను పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. జిల్లాల్లో పరిస్థితులను ఆర్టీజీ సెంటర్ ద్వారా నిరంతరం గమనిస్తూ, ప్రతీ 3 గంటలకు ఒకసారి తనకు నివేదిక అందించాలని మంత్రులను, అధికారులను ఆదేశించారు. ఆయిల్ డిపోల నుంచి రిటైల్ బంకులకు ట్యాంకర్లు ఎలాంటి జాప్యం లేకుండా చేరేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎవరైనా బ్లాక్ మార్కెట్‌కు పాల్పడినా, కృత్రిమ కొరత సృష్టించాలని చూసినా వారిపై కఠిన చర్యలు తప్పవని చంద్రబాబు హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పలు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సివిల్ సప్లైస్ ఉన్నతాధికారులు, పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 144 ఏళ్ల క్రితం కేదార్‌నాథ్.. అరుదైన ఫొటో పంచుకున్న ఆనంద్ మహీంద్రా

ఢిల్లీ: 2026 కేదార్‌నాథ్ యాత్ర ఘనంగా ప్రారంభమైంది. పరమశివుడి పవిత్ర క్షేత్రాల్లో ఒకటైన కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు శీతాకాలం తర్వాత తిరిగి తెరుచుకోవడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ఉత్తరాఖండ్‌లోని గర్వాల్ హిమాలయాల నడుమ కొలువైన ఈ శివయ్యను దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు కఠినమైన ప్రయాణాన్ని సైతం లెక్కచేయకుండా వస్తున్నారు. యాత్ర ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే రికార్డు స్థాయిలో భక్తుల రద్దీ కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా, ఒకప్పటి కేదార్‌నాథ్ యాత్ర ఎలా ఉండేదో గుర్తుచేస్తూ ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. ఆయన తన 'ఎక్స్' ఖాతాలో 1882లో తీసిన కేదార్‌నాథ్ ఆలయ అరుదైన ఫొటోను పంచుకున్నారు. ఇది కేదార్‌నాథ్‌కు సంబంధించిన అత్యంత పురాతన ఫొటోలలో ఒకటిగా భావిస్తున్నారు. ఈ ఫొటో తన దృష్టిని వెంటనే ఆకర్షించిందని ఆయన పేర్కొన్నారు. ఈ ఫొటో తీసిన సమయంలో కేదార్‌నాథ్‌కు చేరుకోవడానికి సరైన రోడ్లు, రైలు మార్గాలు గానీ, హెలికాప్టర్లు గానీ అందుబాటులో లేవని మహీంద్రా తన పోస్ట్‌లో గుర్తుచేశారు. "హిమాలయాల ఒడిలో కొలువైన శివయ్య నిలయం" అంటూ కేదార్‌నాథ్‌ను అభివర్ణించిన ఆయన, ఆ రోజుల్లో యాత్రకు వెళ్లాలంటే అపారమైన సమయం, సహనం, అన్నింటికీ మించి దృఢమైన విశ్వాసం ఉండాలని అన్నారు. యాత్రికులకు అప్పట్లో గమ్యం కంటే ప్రయాణమే యాత్రలో కీలకమైన అనుభూతిని ఇచ్చేదని ఆయన వివరించారు. ప్రస్తుతం సాంకేతికత పెరిగి, సౌకర్యాలు అందుబాటులోకి రావడం వల్ల ఎక్కువ మంది భక్తులు సులభంగా దర్శనం చేసుకోగలగడం మంచి పరిణామమేనని అంగీకరిస్తూనే, ఆయన ఒక ఆలోచన రేకెత్తించే ప్రశ్నను లేవనెత్తారు. "యాత్రలో నెమ్మదిగా ప్రయాణిస్తూ, ఆ ప్రయాణాన్ని ఆస్వాదించే తత్వాన్ని మనం కాపాడుకోవాల్సిన అవసరం లేదా?" అని ఆయన ప్రశ్నించారు. వేగం పెరిగిన ప్రస్తుత ప్రపంచంలో గమ్యం చేరడమే కాకుండా, ఆ ప్రయాణంలో లభించే అనుభవాన్ని కూడా మనం కోల్పోకుండా చూసుకోవాలనే సందేశాన్ని ఆయన తన పోస్ట్ ద్వారా పరోక్షంగా అందించారు.

# బీజేపీలో ఆప్ ఎంపీల విలీనానికి రాజ్యసభ ఆమోదం

ఢిల్లీ: జాతీయ రాజకీయాల్లో పెను సంచలనం నమోదైంది. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు అధికారికంగా బీజేపీ పార్లమెంటరీ పార్టీలో విలీనమయ్యారు. ఈ మేరకు రాజ్యసభ చైర్మన్ ఈ విలీనాన్ని ఆమోదించినట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. బీజేపీలో చేరిన ఏడుగురు ఎంపీలు ఎంతో క్రమశిక్షణ కలిగిన వారని, పార్లమెంటరీ నిబంధనలకు లోబడి పనిచేసే వారంటూ కిరణ్ రిజిజు కొనియాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని వారిని ఆహ్వానించిన మంత్రి, ఇదే సమయంలో విపక్షాల 'ఇండి' కూటమిపై విరుచుకుపడ్డారు. తుక్డే-తుక్డే ఇండి అలయన్స్‌కు గుడ్ బై చెప్పే సమయం వచ్చింది అంటూ రిజిజు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి.

# హైదరాబాద్ అభివృద్ధికి 'హెచ్-సిటీ' పేరిట ప్రభుత్వ కొత్త ప్రణాళిక

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం 'హెచ్-సిటీ' (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) అనే బృహత్తర ప్రాజెక్టును పట్టాలెక్కించింది. గత ప్రభుత్వ హయాంలో మొదలై అసంపూర్తిగా ఉన్న వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్ఆర్‌డీపీ) పనులతో పాటు కొత్తగా గుర్తించిన ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసి నగర రూపురేఖలు మార్చాలని నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం రూ.7,042 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఇందులో సింహభాగమైన రూ.5,942 కోట్లను 'హెచ్-సిటీ' పనులకే కేటాయించడం గమనార్హం. ఈ ప్రాజెక్టు అమలును వేగవంతం చేసేందుకు జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ కార్పొరేషన్ల కమిషనర్లు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రతివారం సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. ప్రాజెక్టులో భాగంగా జూబ్లీహిల్స్ ప్రాంతంలోని కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రూ.1,090 కోట్లతో భారీ నిర్మాణాలు చేపట్టనున్నారు. దీనిని రెండు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీలో రూ.580 కోట్లతో కేబీఆర్ పార్కు ఎంట్రెన్స్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్లలో రెండు స్టీల్ బ్రిడ్జిలు, మూడు అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. రెండో ప్యాకేజీ కింద రూ.510 కోట్లతో ఫిల్మ్‌నగర్, రోడ్డు నంబర్ 45 జంక్షన్ల వద్ద మరో నాలుగు స్టీల్ బ్రిడ్జిలు, నాలుగు అండర్‌పాసులు నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. మరోవైపు దక్షిణ హైదరాబాద్ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నల్గొండ ఎక్స్ రోడ్స్-సైదాబాద్-ఐఎస్ సదన్ -ఓవైసీ జంక్షన్ కారిడార్ ఫ్లైఓవర్ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. సుమారు 2.5 కిలోమీటర్ల పొడవుతో రూ.620 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ ఫ్లైఓవర్ పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే పాతబస్తీ, కొత్త నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. నిర్ణీత గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేసి, హైదరాబాద్‌ను ట్రాఫిక్ రహిత నగరంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

# బీఆర్ఎస్ రాజకీయ పార్టీ కాదు.. ఒక విప్లవమన్న కేటీఆర్

హైదరాబాద్: బీఆర్ఎస్ రాజకీయ పార్టీ కాదని, ఇది ఒక విప్లవమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ 26వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. నెత్తురు మండి ఒక జాతి ఎత్తిన జెండా ఈరోజుతో పాతికేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుందని తెలిపారు. స్వీయ రాజకీయ అస్తిత్వ పతాకం రెపరెపలాడుతూ సిల్వర్ జూబ్లీ ముగింపు వేడుకను జరుపుకుంటున్న సన్నివేశం ఇది అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాల మైలురాయిని అధిగమించిన మహోజ్వల లాంగ్ మార్చ్ అని తెలిపారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యకర్తలకు, సోషల్ మీడియా వారియర్లకు, అభిమానులకు, నాయకులకు, ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ జాతి ఆత్మగౌరవ ఖ్యాతిన ప్రపంచానికి అందించింది: హరీశ్ రావు బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ జాతి ఆత్మగౌరవ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిందని హరీశ్ రావు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కవితారూపంలో పార్టీ గురించి ట్వీట్ చేశారు. "నాలుగు కోట్ల గొంతులను ఏకం చేసి విప్లవ శంఖం మోగించిన ధిక్కార వేదిక, సమైక్య సంకెళ్లను తెంచి స్వరాష్ట్ర కాంక్షను సాకారం చేసిన యుద్ధ గీతిక, పదేళ్ల పాలనతో ఉద్యమ తెలంగాణను ఉజ్వల తెలంగాణగా తీర్చిదిద్దిన అభివృద్ధి పతాక, తెలంగాణ జాతి ఆత్మగౌరవ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గులాబీ దీపిక, ప్రజల విశ్వాసానికి ప్రతీక, ప్రజా ఉద్యమ పతాక.. భారత రాష్ట్ర సమితి 26 వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు" అంటూ రాసుకొచ్చారు. పాపపు పాలనలో ప్రజల జీవితాలు నలిగిపోతున్న వేళ, ప్రజల గుండెల్లో 'రేవంత్ పోవాలి, కేసీఆర్ రావాలి' అనే నినాదం మార్మోగుతుందని పేర్కొన్నారు. సంక్షేమం అడుగంటి, అభివృద్ధి నిలిచిపోయి, అరాచకం తాండవం చేస్తున్న కాలంలో అదే నినాదం వినిపిస్తోందని అన్నారు. ఉద్యమంలోనైనా, అధికారంలోనైనా, ప్రతిపక్షంలోనైనా ఎప్పుడూ ప్రజల పక్షానే నిలబడి, తెలంగాణను కంటికి రెప్పలా కాపాడుకున్న పార్టీ మన బీఆర్ఎస్ మాత్రమేనని పేర్కొన్నారు. పోరాటాల పునాది మీద పుట్టి, ప్రజల విశ్వాసంతో ఎదిగి, ప్రతి గుండెలో నాటుకుపోయిన గులాబీ శక్తియే బీఆర్ఎస్ అన్నారు. గులాబీ జెండా సగర్వంగా ఎగిరే రోజు ఎంతో దూరంలో లేదని తెలిపారు. నిలిచిపోయిన తెలంగాణ ప్రగతి రథం మళ్లీ పరుగులు తీసే రోజు ఎంతో దూరంలో లేదని హరీశ్ రావు పేర్కొన్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com


## కాకినాడ కలెక్టరేట్ లో ఘనంగా రాజా వాసిరెడ్డి అమరావతి పాలకుడు వెంకటాద్రి నాయుడు జయంతి..



కాకినాడ, మహి న్యూస్, ఏప్రిల్ 27 : అమరావతి పాలకుడు, మహానుభావుడు రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతిని సోమవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్.. అధికారులతో కలిసి రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు పాలనాదక్షత, ప్రజాహితం పట్ల ఆయనకున్న నిబద్ధత నేటితరానికి ఆదర్శంగా నిలుస్తున్నదని పేర్కొన్నారు. 1761 ఏప్రిల్ 27న అచ్చమాంబ, జగ్గ భూపతి దంపతులకు జన్మించిన ఆయన, అమరావతిని రాజధానిగా చేసుకుని గుంటూరు కృష్ణా, ప్రాంతాలను పరిపాలించారన్నారు. అమరావతి ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన కృషి విశేషమని, ముఖ్యంగా అనేక దేవాలయాల నిర్మాణం ద్వారా ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని పెంపొందించారని జిల్లా కలెక్టర్ కొనియాడారు. ఆయన జయంతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారిక రాష్ట్ర ఉత్సవంగా ప్రకటించడం ఆయన గొప్పతనానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాల చేపట్టడం ద్వారా రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు లాంటి ఎందరో మహానుభావులు సేవలు నేటి తరానికి చేరవేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో, జిల్లా పర్యాటక అధికారి లక్ష్మణరావు, అదనపు పర్యాటక అధికారి వి.త్రిమూర్తులు, కాకినాడ డివిల్డీవో పి.వాసుదేవరావు, కలెక్టరేట్ ఏవో ఎస్ రామ్మోహన్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## "జిల్లాలో ఇంధన కొరతపై కలవరం వద్దు..



కాకినాడ, మహి న్యూస్, ఏప్రిల్ 28 : కాకినాడ జిల్లాలో పెట్రోల్, డీజిల్ ఇంధన కొరత కారణంగా పలు పెట్రోల్ బంకులు మూసివేయడంపై భయాందోళనలు అవసరంలేదని ఇంధన సరఫరా సజావుగా కొనసాగుతుందని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అన్నారు. ఇంధన కొరత, జిల్లాలో పలు పెట్రోల్ బంకులు మూసివేతపై ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను నివారించేందుకు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పెట్రోల్ బంకులు, వివిధ కంపెనీల రిటైల్ అవుట్లెట్ యూనిట్లను తనిఖీ చేశారు. కాకినాడ రూరల్ మండలం వాకలపూడి లైట్స్ హౌస్ సమీపంలోని ఐఓసీఎల్, బీపీసీఎల్, నయారా ఇతర పెట్రోలు బంకుల రిటైల్ అవుట్ లైట్ యూనిట్ లను జేసీ అపూర్వ భరత్.. కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లి బాబు ఇతర అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బంకుల్లోని ఇంధన నిల్వలు, సరఫరా స్థితి, పంపిణీ వ్యవస్థను ప్రత్యక్షంగా పరిశీలించిన సంబంధిత ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇంధన కొరతపై వినియోగదారులు కలవరం చెందాల్సిన పని లేదన్నారు. జిల్లాలో కొన్నిచోట్ల బంకులు తాత్కాలికంగా మూసివేయడం సాంకేతిక లేదా నిర్వహణ సంబంధిత కారణాలు సరఫరా లోపం కారణంగానే మూసి వేయడం జరుగుతుందన్నారు. ఇంధనంపై వదంతులకు కట్టడికి జిల్లా వ్యాప్తంగా ముమ్మరతనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలోని ఆయా ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తూ జిల్లాలోని వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా నిరంతరం సరఫరా చేసేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ప్రజలు వదంతులను నమ్మవద్దని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఇంధన సరఫరా పూర్తిగా నియంత్రణలో ఉందిని జేసీ తెలిపారు. జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో ఇంధన సరఫరాపై వచ్చిన వార్తలను దృష్టిలో ఉంచుకుని కాకినాడ మరియు పెద్దాపురం డివిజన్ల పరిధిలోని వివిధ మండలాల్లో క్షేత్రస్థాయి అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టామన్నారు. ప్రతి బంకులో అందుబాటులో ఉన్న నిల్వలు, రోజువారీ సరఫరా, విక్రయ పరిస్థితులపై సమగ్రంగా పరిశీలించి నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు జేసి తెలిపారు.

## పెట్రోల్ డీజల్ కొరత పై వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు



తిరుపతి మహి న్యూస్, ఏప్రిల్ 26: జిల్లాలో పెట్రోల్ డీజిల్ కొరత పై వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, కృత్రిమ కొరతను అదునుగా తీసుకొని బ్లాక్ మార్కెటింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. జిల్లాలో పెట్రోల్ డీజిల్ కొరత పై సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ ఆదివారం రాత్రి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు తో కలిసి తిరుపతి పట్టణంలోని మహతి ఆడిటోరియం సమీపంలో గల పెట్రోల్ బంకును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ జి.నరసింహులు, తిరుపతి ఆర్ డి ఓ రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందని వస్తున్న అబద్ధపు ప్రచారాలను నమ్మి ప్రజలు భయాందోళనకు గురి కావద్దని, జిల్లాలో సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో హెచ్పిసిఎల్, ఐఓసిఎల్, బిపిసిఎల్ ల ద్వారా 185 అవుట్ లెట్ కు ఉన్నాయని, వీటిలో 8 అవుట్ లెట్ లలో మాత్రమే తాత్కాలిక కొరత ఏర్పడిందని తెలిపారు. ఈ అవుట్ లెట్ లకు సోమవారం ఉదయం 9 గంటలకల్లా పెట్రోల్ డీజిల్ సరఫరాను పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. పెట్రోల్, డీజిల్ ను క్యాన్, డ్రమ్ములలో నింపడం జరగదని, తాత్కాలిక ఇబ్బందులను అదునుగా తీసుకొని పెట్రోల్ డీజిల్ బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్నట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. మధ్య ఆసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడిందన్న సోషల్ మీడియా వదంతులను నమ్మవద్దని, జిల్లాలో మరో 25 రోజుల వరకు అవసరమైన పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులు తమకు అవసరమైన మేరకు పెట్రోల్, డీజిల్ ను నింపుకోవాలని, ఆ విధంగా పెట్రోల్ బంక్ యాజమాన్యాలకు సూచనలు ఇస్తున్నామని తెలిపారు. జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు మాట్లాడుతూ సోషల్ మీడియా ఇతర ధ్రువీకరించని మీడియాలలో జిల్లాలో పెట్రోల్ డీజిల్ కొరత ఏర్పడిందని చేస్తున్న అసత్య ప్రచారం కారణంగా ప్రజలు భయాందోళనకు గురై పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరుతున్నారని తెలిపారు. అవసరం లేకపోయినా ట్యాంక్ ఫుల్ చేయవలసిందిగా పెట్రోల్ బంక్ యాజమాన్యంపై ప్రజలు ఒత్తిడి తీసుకురావడం జరుగుతున్నదని తెలిపారు. రోజువారి వినియోగానికి అవసరమైన మేరకు పెట్రోలు డీజిల్ నిల్వలను రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో అందుబాటులో ఉంచిందని పేర్కొన్నారు.

## అన్నవరం సత్యదేవునికి ఘనంగా ఇంద్రకీలాద్రి నుండి పట్టువస్త్రాల సమర్పణ



ఇంద్రకీలాద్రి, మహి న్యూస్, ఏప్రిల్ 27: అన్నవరం రత్నగిరిపై కొలువైన వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దివ్య కళ్యాణోత్సవాలను పురస్కరించుకుని, విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గ అమ్మవారి సన్నిధి నుండి పట్టువస్త్రాలను ఈరోజు సాయంత్రం అత్యంత వైభవంగా సమర్పించారు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాన్ని పాటిస్తూ, ఇంద్రకీలాద్రి దేవస్థానం తరపున అధికార బృందం రత్నగిరి క్షేత్రానికి చేరుకుంది. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) దంపతులు, ఆలయ కార్యనిర్వహణాధికారి వీకే శీనా నాయక్ దంపతులు, ఆలయ అర్చకులు మరియు ధర్మకర్తల మండలి సభ్యులు పట్టువస్త్రాలతో అన్నవరం చేరుకోగా, రత్నగిరి దేవస్థాన అధికారులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. మంగళవాయిద్యాల నడుమ శ్రీ కనకదుర్గ అమ్మవారి తరపున పట్టువస్త్రాలను, పూజా సామాగ్రిని స్వామి వారికి భక్తిశ్రద్ధలతో అందజేశారు. శ్రీ సత్యనారాయణ స్వామి వారి దర్శనం అనంతరం, అన్నవరం దేవస్థాన ఈవో చక్రధరరావు ఆధ్వర్యంలో వేద పండితులు విజయవాడ బృందానికి వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఇరు దేవస్థానాల అధికారులు ఆధ్యాత్మిక విశేషాలను పంచుకున్నారు. ఈ విశేష కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, పి. రాఘవరాజు, దేవస్థానం ముఖ్య అర్చకులు ఆర్. శ్రీనివాసశాస్త్రి, దేవస్థాన సిబ్బంది ఎమ్. జయప్రకాష్ (జెపి), కె. లీలాకృష్ణ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అన్నవరం సత్యదేవుని కళ్యాణోత్సవ వేళ ఇంద్రకీలాద్రి అమ్మవారి పట్టువస్త్రాల సమర్పణ రెండు ప్రముఖ పుణ్యక్షేత్రాల మధ్య ఉన్న ఆధ్యాత్మిక అనుబంధాన్ని మరోసారి చాటిచెప్పింది.

# జెన్ ..... మీలో మార్పు రావాలి

### సీవీబీఆర్. యస్కెఆర్.

కాన్హా హైదరాబాద్ మహి న్యూస్ ఏప్రిల్ 28.:

ఒకసారి, ఒక మహిళ సన్యాసి ఒక్క పర్వతంపై ధ్యానం చేస్తుంది. అక్కడికి ఓ వ్యక్తి వస్తాడు.

ఆమె ఆశ్రయం పొంది ఇలా అడిగాడు:

"ఇంత ఏకాంత ప్రదేశంలో మీరు ఇక్కడ ఒంటరిగా ఏమి చేస్తున్నారు?"

దానికి ఆమె ఇలా సమాధానమిచ్చింది:

"నాకు చాలా పనులు ఉన్నాయి!"

"మీకు ఏమి పని ఉంది?

ఇక్కడ మీ చుట్టూ ఏమీ కనిపించడం లేదు?"

"నేను రెండు గద్దలు మరియు రెండు డేగలకు శిక్షణ ఇవ్వాలి, రెండు కుందేళ్ళకు భరోసా ఇవ్వాలి, ఒక పామును క్రమశిక్షణలో పెట్టాలి, గాడిదను ప్రేరేపించాలి మరియు సింహాన్ని మచ్చిక చేసుకోవాలి."

"నాకు అవి కనిపించడం లేవు, అవి ఎక్కడికి వెళ్ళాయి?"

"వాళ్ళందరూ నా లోపల ఉన్నారు"

" నాకు అందించిన ప్రతిదానిపై మంచి లేదా చెడు, వాటిని స్పష్టంగా చూడడానికి నేను వాటిపై పని చేయాలి - అవి నా కళ్ళు.

రెండు డేగలు గోళ్ళతో గాయపడి నాశనం చేస్తాయి, నేను వాటికి




శిక్షణ ఇవ్వాలి.

అవి నా చేతులు.

కుందేళ్లు తమకు నచ్చిన చోటికి వెళ్లాలని కోరుకుంటాయి, అదే సమయంలో అవి క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవటానికి ఇష్టపడవు, బాధ లేదా తడబాటు వచ్చినా నేను వాటికి ప్రశాంతంగా ఉండాలని నేర్పించాలి.

అవి నా పాదాలు.

గాడిద ఎప్పుడూ అలసిపోతుంది, మొండిగా ఉంటుంది మరియు నేను నడిచిన ప్రతిసారీ భారాన్ని మోయడానికి ఇష్టపడదు.

అది నా శరీరం!

"పామును మచ్చిక చేసుకోవడం చాలా కష్టం." ఇది 32 కడ్డీలతో బలమైన పంజరంలో బంధించబడినప్పటికీ, సమీపంలోని ఎవరినైనా కుట్టడానికి, కాటువేయడానికి మరియు విషపూరితం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది.

నేను దానిని క్రమశిక్షణలో పెట్టాలి,

అది నా నాలుక.

నాలో సింహం కూడా ఉంది.

"నేను రాజుని" అని గర్వంగా అనుకుంటాడు.

నేను దాని మచ్చిక చేసుకోవాలి,

మరియు అది నా అహంకారం.

చూడండి మిత్రమా, నాకు చాలా పనులు ఉన్నాయి."

"మన వనరులను మనం ఎలా ఉపయోగిస్తాము అనేది మన స్వభావాన్ని నిర్వచిస్తుంది. మన వనరులు మన మనస్సు, మేధస్సు, అహం... తర్వాత సమయం మరియు డబ్బు, శక్తి మొదలైన బాహ్య వనరుల వంటి మన అంతర్గత సామర్థ్యాలు. మనం వాటిని సరైన ప్రయోజనం కోసం మంచి మార్గంలో ఉపయోగించాలి."

దాజీ మాస్టర్.

సేకరణ. సీవీ బీ ఆర్. కాన్హా శాంతివనవం. హైదరాబాద్.

# ఒక రూపాయి నాణెంతో ... సంకల్పబలం తో చిన్నారి.

### డా. మధుసూదన సాయి స్వామి

ముద్దనేహళ్లి కర్ణాటక మహీన్యూస్ ఏప్రిల్ 29.: ఎనిమిదేళ్ల ఒక చిన్న బాలుడు మార్కెట్‌లోని ఒక దుకాణానికి వెళ్లి, దుకాణదారుడికి ఒక రూపాయి నాణెం చూపిస్తూ అడిగాడు: "మీ దుకాణంలో దేవుడు ఉంటే, ఈ ఒక రూపాయికి నాకు ఆయనను ఇస్తారా?" దుకాణదారు కోపంగా ఆ నాణట్నన్ని బాలుడి చేతి నుంచి కొట్టి, అతడిని వెళ్లగొట్టాడు. బాలుడు నాణట్నన్ని తీసుకుని, ఒక దుకాణం నుంచి మరొక దుకాణానికి తిరుగుతూ, "ఒక రూపాయికి దేవుడు దొరుకుతాడా?" అని అడుగుతూనే ఉన్నాడు. చాలా మంది దుకాణదారులు అతడిని తోసివేశారు. కానీ ఆ బాలుడు మాత్రం ధైర్యం కోల్పోలేదు. చివరికి ఒక పెద్ద దుకాణంలోకి వెళ్లి అదే ప్రశ్న అడిగాడు. ఆ దుకాణ యజమాని చాలా కోపంగా అతడిని బయటికి లాగి తోసేశాడు. ఆ బాలుడు రోడ్డుపై . . అప్పుడే వెళ్లిపోతున్న ఒక ఖరీదైన విలాసవంతమైన కారు ముందు పడిపోయాడు. కారు వెంటనే ఆగింది. అదృష్టవశాత్తూ అతనికి ఎలాంటి గాయాలు కాలేదు. ఒక ధనవంతుడు కారు నుంచి దిగుతూ ఏమైంది అని అడిగాడు. బాలుడు జరిగిన సంగతిని మొత్తం చెప్పి, తన ఒక రూపాయి నాణెం చూపిస్తూ అడిగాడు:

"మీ దగ్గర దేవుడు ఉంటే, ఈ ఒక రూపాయికి నాకు ఇస్తారా?"

ఆ ధనవంతుడు చిరునవ్వు చిందిస్తూ అడిగాడు:

"నేను ఒక రూపాయికి దేవుణ్ణి కొనుగోలు చేసి నీకు ఇస్తే, ఆయనతో ఏమి చేస్తావు?"

బాలుడు సమాధానమిచ్చాడు:

"నా అమ్మ నాకు అన్నీ. ఆమె నాకు భోజనం పెడుతుంది, జోలపాటలు పాడుతుంది, నన్ను చూసుకుంటుంది. ఇప్పుడు ఆమె చాలా అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉంది. డాక్టర్లు 'దేవుడే ఆమెను కాపాడగలడు' అన్నారు. అందుకే ఒక రూపాయికి దేవుడు దొరుకుతాడేమో అని వెతుకుతున్నాను."

ఇది విన్న ఆ ధనవంతుడు అన్నాడు:


"నీకు ఒక రూపాయికి దేవుడు కావాలా? నేను ఇస్తాను."

అతడు ఒక లేఖ రాసి, కవర్లో పెట్టి బాలుడికి ఇచ్చాడు.

"నీ అమ్మ ఉన్న ఆసుపత్రికి వెళ్లి, ఈ లేఖను ఒక ప్రత్యేక డాక్టర్‌కి ఇవ్వు," అని చెప్పాడు.

బాలుడు వెంటనే ఆసుపత్రికి వెళ్లి ఆ లేఖను పేర్కొన్న డాక్టర్‌కు ఇచ్చాడు. డాక్టర్ ఆ లేఖను తెరిచి చూసి ఆశ్చర్యపోయాడు. అది ఆసుపత్రి స్థాపకుడు స్వయంగా రాసిన లేఖ. వెంటనే బాలుడి తల్లికి అత్యుత్తమ వైద్యం అందించేలా ఏర్పాట్లు చేశారు. కొద్ది రోజుల్లోనే ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడింది.

కొన్ని రోజుల తరువాత, అదే కారు నుంచి దిగిన ఆ ధనవంతుడు---అదే ఆసుపత్రి స్థాపకుడు---ముఖ్య వైద్యులతో




కలిసి ఆమెను చూడడానికి వచ్చాడు.

తల్లి ఆసుపత్రి ఖర్చులు ఎలా చెల్లించాలి అని ఆందోళన చెందుతోంది.

ఆ ధనవంతుడు ఆమెను ధైర్యం చెప్పాడు:

"మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మీ కుమారుడు ఇప్పటికే మీ చికిత్సకు కావాల్సిన మొత్తం చెల్లించాడు."

అది విన్న తల్లి ఆశ్చర్యపోయి, తన పక్కన నిద్రిస్తున్న తన కుమారుడిని చూసింది.

ఆయన మరలా అన్నాడు:

"వైద్య ఖర్చులు తీర్చిన తర్వాత మిగిలిన మొత్తాన్ని మీ కుమారుడి చదువుకు వినియోగిస్తాను."

తల్లి భావోద్వేగానికి లోనై, "మీరు ఇది ఎందుకు చేస్తున్నారు?" అని అడిగింది.

ఆయన సమాధానం ఇచ్చాడు:

"మీ కుమారుడి దేవుడిపై ఉన్న అచంచల విశ్వాసం, ఆయన ఎక్కడున్నా సంపాదించాలనే సంకల్పమే ఈ సేవకు కారణం."

హృదయంలో విశ్వాసం ఉండి, దృఢమైన సంకల్పం ఉంటే --- ఒక రూపాయికైనా దేవుడు దొరుకుతాడు. మాకు కళ్ల ముందు జరిగిన సంఘటనలు కోకొల్లలు.

సేకరణ. సింధూ.తమిళ తంబీలకు ఇచ్చి పడేసిన మాలీవుడ్ బ్యూటీ!

భారతీయ చిత్ర పరిశ్రమలో భాషా పరమైన సరిహద్దులు చెరిగిపోతున్నాయి. ఒక భాషా నటులు మరో భాషలో రాణించడం సర్వసాధారణమైంది. అయితే ఇటీవల తమిళ చిత్ర పరిశ్రమలో మలయాళ నటుల ఆధిపత్యం పెరుగుతోందని స్థానిక నటులకు అవకాశాలు తగ్గుతున్నాయని సోషల్ మీడియాలో కొంత చర్చ నడుస్తోంది. తాజాగా ఈ అంశంపై -ప్రేమలు- ఫేమ్ మమితా బైజు ఘాటుగా స్పందించింది. నటులను భాషా ప్రాతిపదికన చూడటం కంటే వారి ప్రతిభను బట్టి చూడటం ముఖ్యమని అభిప్రాయపడింది. తమిళ సినిమాల్లో మలయాళ నటులను తీసుకోవడంపై వస్తోన్న విమర్శలను సున్నితంగా తిప్పికొట్టింది. సినిమా అనేది కళారూపమని దానికి ఎల్లలు ఉండవంది. ఒక పాత్రకు ఎవరు సరిపోతారో? దర్శకులు నిర్ణయిస్తారని అది కేవలం నటనకు సంబంధించిన విషయమే తప్ప ప్రాంతీయతకు కాదని అభిప్రాయపడింది. ప్రతిభ ఉన్న ఎవరైనా ఎక్కడైనా రాణించొచ్చు అంది. ఇది పరిశ్రమలో ఆరోగ్యకరమైన పోటీని, నాణ్యతను పెంచుతుందని వివరించింది. సినిమా రంగంలో సరిహద్దులను చెరిపేయడమే అసలైన విజయమని మమితా భావిస్తోందని ఆమె మాటలే స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం పాన్-ఇండియా ట్రెండ్ నడుస్తోన్న తరుణంలో నటులు కంఫర్ట్ జోన్ నుండి బయటకు వచ్చి విభిన్న భాషల్లో నటించడంతో కొత్త రకమైన కంటెంట్ పుట్టుకొస్తుందని తెలిపింది. మలయాళ నటులు తమిళంలో నటించడం వల్ల రెండు పరిశ్రమల మధ్య సాంస్కృతిక మార్పిడి జరుగుతుందని ఇది ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని అభిప్రాయపడింది. మమితా బైజు మలయాళ పరిశ్రమ నుండి వచ్చిన నటి అన్న సంగతి తెలిసిందే. -ప్రేమలు- సినిమాతో తెలుగు, తమిళ ప్రేక్షకులకు ఎంతో దగ్గరైంది. అమ్మడి నటనకు, హావభావాలకు భాషతో సంబంధం లేకుండా అన్ని ప్రాంతాల ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. నటుడికి ప్రేక్షకుల ప్రేమ లభించినప్పుడు వారు ఏ భాషకు చెందిన వారు అనేది అనవసరమైన చర్చగా పేర్కొంది. భాష, ప్రాంతం ఇంకా ఏవోవో? అనుకుంటే వాటితో సాధించేది ఏదీ ఉండదని చెప్పుకొచ్చింది. ప్రతిభను గుర్తించే విషయంలో దక్షిణాది ప్రేక్షకులు ఎప్పుడూ ముందుంటారని కొనియాడింది. పరిశ్రమలో వస్తోన్న మార్పులను సానుకూల దృక్పథంతో చూడాలని కోరింది. మలయాళ నటులే కాదు, తమిళ నటులు కూడా మలయాళంలో లేదా తెలుగులో నటిస్తున్నారని ఇది ఆయా పరిశ్రమలకు మంచి వాతావరణం కల్పించడం లాంటిదంది. సినిమాల నాణ్యత పెరగడానికి, విభిన్న రకాల కథలు రూపొందడానికి ఇలాంటి క్రాస్-కల్చరల్ కాస్టింగ్ ఎంతో అవసరమని నొక్కి చెప్పింది. ఈ అంశంపై ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవి సహా చాలా మంది నటులు ఎంతో పాజిటివ్ గా స్పందించారు. అన్ని భాషల నటులు కలిసి పనిచేసినప్పుడే మంచి చిత్రాలతో పాటు మార్కెట్ కూడా బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

## బీసీ భవనంతో పాటు కమ్యూనిటీ భవనాలు నిర్మించి ఇవ్వాలి

### విజయనగరం జిల్లా బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ కులాల ఐక్యవేదిక నాయకులు విన్నపం.






విజయనగరం, మహిన్యూస్, ఏప్రిల్ 27: కలెక్టర్ గ్రీవెన్స్ లో బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ కులాల ఐక్యవేదిక నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ ను కలిసి బీసీ భవనం తో పాటు కమ్యూనిటీ భవనాలు కట్టించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు చోడి ఆదినారాయణ, దిమిలి పైడ్రాజు, ఇప్పిలి రామారావు, జంపాన చిన్న, మాట్లాడుతూ జిల్లాలో ఎన్నో ఏళ్లుగా బీసీలు ఎదురుచూస్తున్న బీసీ భవన్ తో పాటు, కమ్యూనిటీ భవనాలు ఏర్పాటు చేస్తే, బీసీ విద్యార్థులకు, బీసీ ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. జిల్లాలో బీసీ విద్యార్థులు సుదూర ప్రాంతాల నుండి వచ్చి కాలేజీలోను, ట్యూషన్ సెంటర్ లోను జాయిన్ కావడం జరుగుతుందని తెలిపారు.ఉండేందుకు ప్రభుత్వ వసతి గృహాలలో చోటులేక అద్దె ఇంట్లో ఉండడం జరుగుతుందని తెలిపారు.రూమ్ కిరాయి,భోజనం కొరకు విద్యార్థులు అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేయడం వలన ఇటు విద్యార్థులు అటు తల్లిదండ్రులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బీసీ ప్రజల కోసం సామాజిక కార్యక్రమాల కోసం, సభను సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం కోసం భవనాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అందువలన బీసీ విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో బీసీ భవనంతో పాటు అన్ని కులాలకు కమ్యూనిటీ భవనాలను నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీవీ దుర్గారావు, కొల్లేటి శ్రీను, కోనాడ సతీష్, రాజమండ్రి ఈశ్వరరావు, శీల తాతారావు, మొదలగు వివిధ కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి కళ్యాణం

### శివనామ స్మరణతో మార్మోగిన ఆలయం.



తాళ్లరేవు, మహి న్యూస్, ఏప్రిల్ 27.: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెం గ్రామంలో వేంచేసి యున్న శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి వారి ఆలయంలో వైశాఖ మాసాన్ని పురస్కరించుకుని దివ్య కళ్యాణ మహోత్సవం భక్తి పారవశ్యంతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. గ్రామం మొత్తం పండుగ వాతావరణంలో



మునిగిపోయి, భక్తుల సందడితో ఆలయ పరిసరాలు నిండిపోయాయి. ఈ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు శ్రీ కంఠం భీమేశ్వర శర్మ పర్యవేక్షణలో, విశ్వనాథ శర్మ బ్రహ్మత్వంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు,సత్య గౌరీ,,ఉమామహేశ్వరరావు, హేమ వీర వల్లి,, రవికుమార్, తిరూప,దంపతులు ప్రధాన యజమానులుగా వ్యవహరించి స్వామివారి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించగా, వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికతతో మార్మోగింది.



సాయంత్రం జరిగిన స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవం కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి-అమ్మవార్ల కళ్యాణం నిర్వహించగా, భక్తులు హర్షధ్వానాలతో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించి గ్రామంలోని పురవీధుల మీదుగా ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు సమయంలో భక్తులు భజనలు, కోలాటాలు చేస్తూ స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువతతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, అందరూ భక్తి శ్రద్ధలతో స్వీకరించారు. ఈ దివ్య కళ్యాణ మహోత్సవం గ్రామంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపుతూ, భక్తులలో భక్తి భావాన్ని మరింత పెంచింది.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
మంగళవారం - 28 - ఏప్రిల్ - 2026

# పి.జి.ఆర్.ఎస్ కు 499 అర్జీలు

గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 27 : జిల్లాలో పి.జి.ఆర్.ఎస్ కు మొత్తం 499 అర్జీలు అందాయి. అందులో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 250, పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 186 అర్జీలు, గుంటూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో 4 అర్జీలు, తెనాలి రెవిన్యూ డివిజన్ పరిధిలో 16 అర్జీలు, గుంటూరు నగర పాలక సంస్థకు 36, మిగిలిన మున్సిపాలిటీల పరిధిలో 7 అర్జీలు అందాయిలి సోమవారం ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు. అర్జీదారులు పింఛన్లు, రేషన్ కార్డులు, గృహాలు మంజూరు చేయాలని, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ ఆర్జీలను సమర్పించారు.

### అందిన కొన్ని ఆర్జీల వివరాలు

గుంటూరు పట్టణం నెహ్రూ నగర్ నుండి ఉమామహేశ్వరి అనే మహిళ ఆర్జీని సమర్పిస్తూ మహిళా సంఘం నుండి రావలసిన డబ్బులు ఇవ్వడం లేదని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామం నుండి గుళ్ళ పానకాలు అర్జీని సమర్పిస్తూ పొలం ఆక్రమణకు గురి అయ్యిందని, చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రత్తిపాడు మండలం బొంతపాడు గ్రామం నుండి శుద్ధపాడు మేరీ అర్జీ సమర్పిస్తూ వికలాంగ పింఛను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ గంగ రాజు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. పద్మావతి, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ, ఇన్ ఛార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రావణ్ బాబు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా పర్యాటక అధికారి రమ్య, దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ మాధవి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

# వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

## జిల్లాలో 68 కేంద్రాల్లో శిక్షణకు ఏర్పాట్లు



శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 27 : జిల్లాలోని క్రీడాకారులు, విద్యార్థులు వివిధ క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవడం కోసం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను మే 1వ తేదీ నుండి 31వ తేదీ ఉచితంగా నిర్వహిస్తున్నట్టు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 68 కేంద్రాలలో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ శిబిరాల్లో పాల్గొనేందుకు 8 నుండి 16 సంవత్సరాల వయసు కలిగిన బాలబాలికలు అర్హులు. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటల నుండి 8.00 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5.00 గంటల నుండి 7.00 గంటల వరకు శిక్షణలు ఉంటాయి. ఆసక్తి గల క్రీడాకారులు ంజూశీ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ లేదా క్రీడా యాప్ ద్వారా తమ పేర్లను ముందస్తుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలోని ప్రధాన కేంద్రాలైన శ్రీకాకుళం కోడి రామమూర్తి స్టేడియం, టెక్కలి, పలాస, ఇచ్చాపురం, నరసన్నపేట, ఆముదాలవలస, రణస్థలం తదితర ప్రాంతాల్లో అథ్లెటిక్స్, బాక్సింగ్, కబడ్డీ, వాలీబాల్, హాకీ, హ్యాండ్ బాల్, వెయిట్ లిఫ్టింగ్ వంటి వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిబిరాల్లో నిష్ణాతులైన కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు విద్యార్థులకు మెళకువలునేర్పిస్తారన్నారు.

### 68 చోట్ల శిబిరాలు:

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఏ. మహేశ్ బాబు, సెట్ శ్రీ సిఇఓ వి. వెంకట అప్పలనాయుడు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ బీవీ రమణలు శిబిరాలు దించే ప్రాంతాల జాబితాను సోమవారం తమ కార్యాలయంలో ప్రకటించారు. మరింత సమాచారం కోసం 7680075375 నంబర్‌ను లేదా ూతీఅఝఎబశ్రీఖఎ.ఎఝఏస్త్రఝఅశ్రీ.ఒశీఎ ఈమెయిల్ ద్వారా, లేదా డిఎస్ఏ క్యూఆర్ కోడ్ సంప్రదించాలని వారు సూచించారు.

# బంకులను తనిఖీ చేసిన కలెక్టర్



గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 27 : జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ సోమవారం పెట్రోల్ బంకులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరం పాలెం భారత్ పెట్రోల్ బంకును, వెంకటప్పయ్య కాలనీ లోని హెచ్.పి పెట్రోల్ బంకును జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. బంకులలో ఇంధన నిల్వలు, విక్రయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంధనం కోసం వచ్చిన వినియోగదారులతో ముఖాముఖి మాట్లాడి పరిస్థితులను ఆరా తీసారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ప్రజలకు అవసరమైన మేరకు ఇంధన సరఫరా నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు అపోహలకు లోనుకావద్దని కోరారు. పెట్రోల్ బంకుల్లో సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తూ ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా సమస్యలు ఉంటే ఆయిల్ కంపెనీ వారిని సంప్రదించి స్టాక్ ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి బంక్ వద్ద ఒక ఉద్యోగిని నియమించి పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. ఆదివారం రాత్రి జిల్లా కలెక్టర్ తో సహా, జాయింట్ కలెక్టర్, పోలీస్ సూపరింటెండెంట్ ఆకస్మిక తనిఖీలు చేసి పరిశీలించడం జరిగిందన్నారు. సోమవారం ఉదయం నుంచి అధికారులు తనిఖీలు చేశారని, సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి

## నివాళులర్పించిన డీఆర్వో, జిల్లా అధికారులు




శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 27: అమరావతి సంస్థానాధీశులు కీ.శే. రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి వేడుకలు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సూచనలు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు పర్యాటక శాఖ, యువజన సర్వీసుల శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వెంకటాద్రి నాయుడు చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు ఆయన చేసిన ధార్మిక, సామాజిక సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, సెట్‌శ్రీ సీఈఓ బి. వెంకటప్పలనాయుడు, జిల్లా పర్యాటక అధికారి ఎన్. నారాయణరావు, కలెక్టరేట్ ఏఓ, పర్యాటక, సెట్‌శ్రీ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# వరి కోత మిషన్లకు డీజిల్ కొరత లేకుండా చర్యలు..



సామర్లకోట, మహి న్యూస్, ఏప్రిల్ 27 : సోమవారం జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్.. పెద్దాపురం ఆర్డీవో ఎన్.శ్రీధర్ ఇతర అధికారులతో కలిసి సామర్లకోట మండలం, ఉండూరు గ్రామంలోని రాధాకృష్ణ పెట్రోల్ బంక్ ను తనిఖీ చేశారు. బంకులోని పెట్రోల్, డీజిల్ నిల్వలు, సరఫరా వంటి వివరాలను యజమానులన అడిగి తెలుసుకున్నారు. అనంతరం యంత్ర పరికరాల ద్వారా వరి పంట కోతలు నిర్వహించుకునే రైతులకు డీజిల్ కూపన్లు జేసీ అపూర్వ భరత్ పంపిణీ చేశారు. రైతులతో మాట్లాడి వరి పంట కోతలకు ఉపయోగించే యంత్రాలకు డీజిల్ కొరత లేకుండా చూడడం జరుగుతుంది అన్నారు. టీన్నులలో కొట్టించు కున్న వారికి ప్రత్యేక కూపన్ల అందించడం జరిగిందని ఈ అవకాశాన్ని రైతుల సద్విని చేసుకోవాలని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పెట్రోల్ డీజిల్ బ్లాక్ లో అధిక ధరలకు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జేసీ అపూర్వ భరత్ తెలిపారు. ఈ పరిశీలనలో జేసీ వెంట సామర్లకోట మండలం తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అమరావతి ప్రభువు వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు 266వ జయంతి



గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 27 : అమరావతి ప్రభువు వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు 266వ జయంతిని అత్యంత ఘనంగా నిర్వహించారు. రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు చిత్ర పటానికి వాసిరెడ్డి వంశానికి చెందిన 6వ తరం వారసుడు, అమరావతి సంస్థానం ఫౌండర్ ట్రస్టీ శ్రీమంత్ రాజా వాసిరెడ్డి సుధా స్వరూప్ మన్నే సుల్తాన్ బహదూర్ తో కలిసి జిల్లా రెవిన్యూ అధికారి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ప్రజాహిత పాలన, ధార్మికత, అభివృద్ధి దృక్పథం నేటి తరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. సమాజ సంక్షేమం కోసం ఆయన చూపిన దారిని అనుసరించడం అవసరమని తెలిపారు. వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు (27 ఏప్రిల్ 1761 -- 17 ఆగస్టు 1817) ఆంధ్రదేశ చరిత్రలో అపూర్వమైన జమీందారు, పరిపాలనలో దిట్ట అన్నారు. గుంటూరు, కృష్ణా ప్రాంతాలను సమర్థంగా పరిపాలిస్తూ శాంతి భద్రతలను బలోపేతం చేసి ప్రజల విశ్వాసాన్ని పొందారని చెప్పారు. ఆయన పాలనలో వ్యవసాయం విస్తృతంగా అభివృద్ధి చెందిందన్నారు. అమరావతిని రాజకీయ, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దిన మహానుభావుడిగా ఆయన చరిత్రలో చిరస్థానం సంపాదించారని పేర్కొన్నారు. అమరేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధిలో విశేష పాత్ర పోషించడంతో పాటు మంగళగిరి, చెబ్రోలు, పొన్నూరు ప్రాంతాల్లో మూడు వందలకు పైగా దేవాలయాలను నిర్మించి, పునరుద్ధరించారన్నారు. 108 దేవాలయాలలో ఒకేసారి ధ్వజస్తంభాలను ప్రతిష్ఠించి అరుదైన చరిత్ర సృష్టించారని తెలిపారు. వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ప్రజాహిత పాలన, న్యాయబద్ధత, పారదర్శకతకు ప్రతీకగా నిలిచారని అభిప్రాయపడ్డారు. ఆయన చేసిన సేవలు నేటికీ ఆదర్శప్రాయంగా నిలుస్తూ సమాజ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వాసిరెడ్డి వంశానికి చెందిన 6వ తరం వారసుడు, అమరావతి సంస్థానం ఫౌండర్ ట్రస్టీ శ్రీమంత్ రాజా వాసిరెడ్డి సుధా స్వరూప్ మన్నే సుల్తాన్ బహదూర్ పాల్గొని మాట్లాడుతూ 266వ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ధర్మప్రచారం, అన్నదానాలు, గోసంరక్షణ వంటి సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించారన్నారు. కవులు, పండితులను ఆదరించి సాహిత్య, సాంస్కృతిక రంగాలకు విశేషంగా సేవలందించారని చెప్పారు. అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తూ రాజా వాసిరెడ్డి సేవలను కొనియాడారు. ప్రజాహిత పాలనకు ప్రతీకగా తరతరాలకు స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం,

### వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.

పద్మావతి, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు, ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ, ఇన్ ఛార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రావణ్ బాబు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా పర్యాటక అధికారి రమ్య, దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ మాధవి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేష శ్రీ, దేవదాయ ధర్మదాయ శాఖ గ్రేడ్ వన్ విశ్రాంత కార్య నిర్వహణ అధికారి లగుమ వరపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్యుని సన్నిధిలో ఉపరాష్ట్రపతి

## శ్రీకూర్మనాథుని సేవలో కూడా తరించిన రాధాకృష్ణన్



శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 27:భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ జిల్లా పర్యటన సోమవారం ఆధ్యాత్మికంగా, అత్యంత ఆత్మీయంగా సాగింది. జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకోవడంతో పాటు కేంద్ర మంత్రితో ఉన్న పాత అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ముందుగా డచ్‌బంగ్లా హెలిప్యాడ్ వద్ద ఉపరాష్ట్రపతికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, డీఐజీ గోపీనాథ్ జెట్టి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి ఘనస్వాగతం పలికారు. అక్కడి నుండి మిల్లు జంక్షన్ మీదుగా కాన్వాయ్‌లో నేరుగా శ్రీకూర్మ క్షేత్రానికి చేరుకున్నారు. లోకైక ఏకైక కూర్మ రూప క్షేత్రంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### అరసవల్లిలో ఆశీర్వచనం:

అనంతరం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ నేతృత్వంలో పూర్ణకుంభంతో స్వాగతం లభించింది. అంతరాలయంలో స్వామివారిని దర్శించుకున్న ఆయనకు వేద మంత్రోచ్చారణల మధ్య తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన ఇంద్ర పుష్కరిణిలో జరుగుతున్న నూతన నిర్మాణ పనులను స్వయంగా వెళ్లి దగ్గరుండి పరిశీలించారు. పర్యటనలో భాగంగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, నడికుదుటి ఈశ్వరరావు, మామిడి గోవిందరావు తదితరులు ఉపరాష్ట్రపతిని గౌరవపూర్వకంగా కలుసుకున్నారు.

### మంత్రి నివాసంలో ఆత్మీయ సమయం:

ఆలయాల దర్శనం అనంతరం ఉపరాష్ట్రపతి నేరుగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు నివాసానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పలువురు ప్రముఖులను ఆయన పలకరించారు. ఈ సందర్భంగా దివంగత కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడుతో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఎర్రన్న సతీమణి విజయలక్ష్మిని, సోదరుడు కింజరాపు ప్రభాకరరావును ఆత్మీయంగా పలకరించారు. అనంతరం మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. సుమారు గంటన్నర పాటు గడిపిన ఆయన, అక్కడి నుండి నేరుగా హెలిప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో విశాఖపట్నం బయలుదేరి వెళ్లారు. ఉపరాష్ట్రపతి పర్యటనను పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో పర్యటన అంతా ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది.

# ప్రపంచ దిగ్గజ సంస్థ గూగుల్ కు సాదర స్వాగతం

## ఈ నెల 28న శంకుస్థాపనతో పనులకు శ్రీకారం



శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 27: నవ్యాంధ్రుల కలల సాకారానికి ప్రాధాన్యం ఇస్తూ, ఉత్తరాంధ్ర కే మణిమకుటంగా అలరారే గూగుల్ డేటా సెంటర్ కు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్య రీతి సాఫల్యం పొందడం తనకు ఎంతో ఆనందంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. అలానే పెట్టుబడుల ఆకర్షణలో భాగంగా రాష్ట్రాన్ని అగ్రగామిగా మలిచే క్రమంలో భాగంగా ఐటీ శాఖామాత్యులు, తెలుగు దేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ కృషి అమోఘం అని ఆయన శ్రమ అనిర్వచనీయం అని చెప్పారు. ఈ నెల 28న తర్లువాడలో 266.6 ఎకరాలలో విఖ్యాత ఐటీ కంపెనీ గూగుల్ ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్ కు శంకు స్థాపన చేయడం శుభ పరిణామం అని అన్నారు. మొత్తంగా విశాఖ కేంద్రంగా మూడు చోట్ల ఏర్పాటు అయ్యే గూగుల్ డేటా సెంటర్ల కు సంబంధించి తొలి దశలో భాగంగా తర్లువాడ డేటా సెంటర్ ఏర్పాటుకు దిగ్గజ సంస్థల అధినేతలు తరలి రావడం ఉత్తరాంధ్రకే సొంతం అయ్యే చారిత్రక పరిణామం అని అభిప్రాయపడ్డారు.

### సమర్థ నాయకత్వానికి ప్రతిబింబం

ఇప్పటికే విశాఖ కేంద్రం గా ఐటీ నగరం అభివృద్ధి దిశగా కాగ్నిజెంట్ తో సహా కీలక సంస్థల రాక , కార్యకలాపాల నిర్వాహణ అన్నది సమర్థనీయంగా సాగడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. కూటమి సర్కారు ఏర్పాటు అయి రెండేళ్లు పూర్తి కాకమునుపే ఇప్పటికే లక్ష కోట్ల పెట్టుబడులు రావడం ఆనందదాయకం అని, ఐటీ రంగానికి ఊతం ఇచ్చే దిశగా వైజాగ్ మెగా డేటా పార్కు లిమిటెడ్ పేరుతో 1.35 లక్షల కోట్ల రూపాయల నిధులతో అదానీ భాగస్వామ్యంతో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్టు అందరి కలలకూ రూపం అని అభిప్రాయపడ్డారు. విద్యా ఉపాధి మౌలిక వసతుల కల్పన వంటి అంశాలతో ముడిపడిన ఈ ప్రాజెక్టు రూపకల్పన నవ్యాధ్ర సారథి చంద్రబాబు సమర్థతకు సంకేత రూపమని కొనియాడారు. విశాఖ కేంద్రం ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సెమికండక్టర్ రంగాలలో పెట్టుబడులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీసుకుంటున్న చొరవ సత్ఫలితాలు ఇస్తోందని, గత ఏడాది అక్టోబర్ నుంచి ఇప్పటి వరకూ వివిధ దశలలో అటు అమెరికా కేంద్రంగానూ ఇటు విశాఖ కేంద్రంగానూ ఆయన తీసుకున్న చర్యలు పురోగామి దిశగా ఉండడం సమర్థ నాయకత్వానికి ప్రతిబింబం అని అన్నారు.

### ఉత్తరాంధ్ర అంటే చంద్రబాబు నాయుడు కి మమకారం...

గూగుల్ హబ్ రాకతో సంబంధిత రంగాల ఆధారంగా ఏర్పాటు అయ్యే కంపెనీలలో దాదాపు రెండు లక్షల మంది వరకూ ఉద్యోగ ఉపాధి అవకాశాలు రానున్నాయని అంచనాగా తెలిపారు. ఆ రోజు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐటీ రంగ అభివృద్ధికి సంబంధించి కనీస చర్యలు లేకపోవడంతో సంబంధిత వ్యవస్థలు అన్నీ కునారిల్లాయని, మళ్లీ ఐటీ రంగం కోలుకునేందుకు ముఖ్యమంత్రితో పాటూ ఐటీ శాఖామాత్యులు తీసుకున్న నిర్ణయాల కారణంగా సంబంధిత రంగాలు అన్నీ పునరుత్తేజం చెందాయని గుర్తుచేశారు. ఆ రోజు వైసీపీ హయాంలో రాష్ట్రం పురోగామి కాకుండా తిరోగమన రూపంలో ఉండిపోవడంతో అభివృద్ధి ఎక్కడికక్కడ నిలిచిపోయిందని, తద్వారా ఏపీ బ్రాండ్ ఇమేజ్ పూర్తిగా జీరో లెవల్ కు పడిపోయిందని ఆవేదన చెందారు. కూటమి ప్రభుత్వం రాకతో కేంద్రం అందిస్తున్న చేయూత కారణంగా డబుల్ ఇంజన్ సర్కారు చేపడుతున్న చర్యలు ఫలించి, ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఐటీ రంగంతో పాటే ఫార్మా, ఇండస్ట్రియల్ సెక్టార్లలో కూడా సంబంధిత దిగ్గజ సంస్థలు రావడం ఉత్తరాంధ్రకే సంబంధిత అవకాశాలు ఎక్కువగా దక్కడం ముఖ్యమంత్రి కి ఈ ప్రాంతం అంటే ప్రేమ అని అనేందుకు నిదర్శనం అని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశంసించారు.

# పెట్రోల్ బంకులలో కలెక్టర్ విస్తృత తనిఖీలు



టంగుటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 27 : డబ్బాలతో వచ్చే వారికి, పెద్ద మొత్తంలో అడిగేవారికి ఆయిల్ పోయవద్దని పెట్రోల్ బంకుల నిర్వాహకులకు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. సోమవారం ఆయన టంగుటూరు మండలంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న పలు ఆయిల్ బంకులను తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్ లను పరిశీలించి, వాహనదారులకు ఆయిల్ పోస్తున్న తీరుపై ఆరా తీశారు. ముందుగా బిపిసిఎల్ డిపోను సందర్శించారు. తమ వద్ద ఉన్న నిల్వలు, డిమాండ్ వివరాలను మేనేజర్ ఎల్. విజయ్ కుమార్ ఈ సందర్భంగా కలెక్టరుకు వివరించారు. జిల్లాలో తమకు 74 రిటైల్ అవుట్లెట్లు ఉన్నాయని, ఎక్కడా కొరతలేదని, ఇండెంట్ రాగానే సరఫరా చేస్తున్నామని చెప్పారు. అవసరానికి తగినంతగా తమ వద్ద నిలువలు ఉన్నట్లు ఆయన తెలిపారు. అనంతరం శివపురం, సూరారెడ్డిపాలెంలోని హెచ్పిసిఎల్ బంకులు, ఐఓసీఎల్ అవుట్ లెట్ ను కూడా కలెక్టర్ పరిశీలించారు. స్థానికంగా తమకు డిపోలు లేకపోవడంతో విజయవాడ నుంచి ఆయిల్ వస్తోందని వారు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఎప్పటికప్పుడు ఇండెంట్ పంపించి, జాప్యం లేకుండా ఆయిల్ ను బంకులలో అందుబాటులో ఉంచేలా చూడాలని నిర్వాహకులకు చెప్పారు. బల్క్ గా ఆయిల్ పోయవద్దని, డబ్బాలలో కూడా వద్దని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయాలను పర్యవేక్షించేందుకు రెవెన్యూ, పోలీసు సిబ్బందిని బంకులలో ఉంచామని, తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, తహసిల్దార్ ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

# 6 కేంద్రాలలో నీట్ పరీక్ష

## జిల్లాలో పకడ్బందీగా నిర్వహణకు ఏర్పాట్లు



ఒంగోలు, మహి న్యూస్, ఏప్రిల్ 27: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ శ్రీ.పి.రాజాబాబు ఆదేశించారు. వచ్చేనెల మూడవ తేదీన జరిగే ఈ పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లు చేయడంపై సోమవారం ఆయన అధ్యక్షతన ప్రకాశం భవనంలో సమావేశం జరిగింది. జాయింట్ కలెక్టర్ శ్రీమతి కల్పనా కుమారితో కలిసి అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో కేంద్రీయ విద్యాలయం, ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, నవోదయ విద్యాలయం, డి.ఆర్. ఆర్.ఎం. మున్సిపల్ ఉన్నత పాఠశాల, పివిఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలలో ఈ పరీక్షలు జరుగనున్నాయి. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు 1728 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఆయా కేంద్రాలలో విద్యుత్, పారిశుద్ధ్యము, త్రాగునీరు వంటి మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు ప్రాథమిక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని అధికారులకు చెప్పారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బస్సులను అందుబాటులో ఉంచాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాల వద్ద ప్రతిష్ట భద్రత ఏర్పాట్లు చేపట్టాలని, సమీపంలో జిరాక్స్ షాపులను మూయించాలని చెప్పారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను చేయటంలో నిర్లక్ష్యం ఉండరాదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిఆర్ఓ బి.చిన ఓబులేసు, ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, డి.ఎం. హెచ్.ఓ. వెంకటేశ్వర్లు, ఆర్టీసీ ట్రాఫిక్ సూపర్వైజర్ ఫణికుమార్, మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు సువార్త, పరీక్షల కోఆర్డినేటర్ రాజేష్, పరీక్షా కేంద్రాల ప్రిన్సిపాళ్ళు, ఈ కేంద్రాలకు నోడల్ అధికారులుగా ఉన్న తహసీల్దారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com
మంగళవారం - 28 - ఏప్రిల్ - 2026

## జలధార - జలహారతి కింద మంజూరైన పనులను

# వేగవంతంగా పూర్తి చేయాలి

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 27:- జలధార - జలహారతి కింద మంజూరైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఎంపిడిఓ లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి రీ సర్వే, జలధార - జలహారతి, వీబీ జీ రామ్ జీ పథకం కింద లేబర్ మొబైలైజెషన్, సెన్సస్ తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జలధార - జలహారతి కు సంబంధించి ఫారం పాండ్స్, పెర్కోలేషన్ ట్యాంకుల మరమ్మతుల పనుల గుర్తింపు ప్రక్రియలో కృష్ణగిరి, ఆలూరు మండలాలు మాత్రమే బాగా చేశారన్నారు. ఆదోని, చిప్పగిరి, దేవనకొండ, కౌతాళం, కర్నూలు, వెల్దుర్తి, కోడుమూరు, మద్దికెర ఈస్ట్, మంత్రాలయం, గూడూరు మండలాలు వెనుకబడి ఉన్నారన్నారు. చెక్ డ్యామ్స్, పర్కోలేషన్ ట్యాంక్స్ పాతవి ఉంటే, రిపేర్స్ అవసరమైనవి గుర్తించి వాటిని రేపటిలోగా పంపాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వీబీ జీ రామ్ జీ పథకం కింద కూలీలకు పనులు కల్పించడంలో కృష్ణగిరి, పెద్దకడబూరు, మంత్రాలయం, గూడూరు తదితర మండలాల్లో పురోగతి చాలా తక్కువగా ఉందన్నారు. వీటిని మెరుగుపరచాలని కలెక్టర్ సంబంధిత మండలాల ఎంపిడిఓ లను ఆదేశించారు. దేవనకొండ, వెల్దుర్తి, కౌతాలం, ఆస్పరి, ఆదోని వంటి మండలాలు మెరుగ్గా ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి మండలం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని, దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. వీఆణాలు, ఇూరాలు, ఫీల్డ్ అసిస్టెంట్లను సమన్వయం చేసుకుంటూ కూలీల సంఖ్యను పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. కూలీల సంఖ్య పెరిగితేనే 'జలధార-జలహారతి' పనుల్లో పురోగతి కనిపిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు జిల్లాలో జనగణన కార్యక్రమం విజయవంతంగా అమలు కావడానికి స్వీయ గణన నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.డీఆర్డీఏ, డ్వామా, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ తదితర శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, లబ్ధిదారులతో నిర్దేశించిన లక్ష్యం మేరకు స్వీయ గణన చేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రీ సర్వే కి సంబంధించి డ్రాఫ్ట్ పట్టా దార్ పాస్ పుస్తకాల ఈ-కెవైసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తప్పుల ఉన్న వాటికి కరెక్షన్ చేసి ఈ కెవైసి పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఇంచార్జి డి ఆర్ ఓ చిరంజీవి, డ్వామా పిడి నరసింహ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## టి.బి నిర్మూలన కు సమగ్ర చర్యలు

## పోషకాహారం, చికిత్సపై ప్రత్యేక దృష్టి

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 27: టి.బి నిర్మూలన కు సమగ్ర చర్యలు చేపడుతుందని పోషకాహారం, చికిత్సపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం పరిధిలో, ప్రధానమంత్రి టి.బి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా గ్రీన్ కో సంస్థ ఆధ్వర్యంలో రోగులకు పోషకాహార ఫుడ్ కిట్లను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో క్షయ వ్యాధి (టి.బి) నిర్మూనలో బాగంగా గ్రీన్ కో సంస్థ వారి ఆధ్వర్యంలో 455 మంది రోగులకు పోషకాహార ఫుడ్ కిట్లను అందజేయడం జరిగిందని టి.బి రోగులకు ప్రభుత్వం ఆరు నెలలపాటు నిరంతర చికిత్స అందజేస్తోందని తెలిపారు. రోగుల రోగనిరోధక శక్తి (ఇమ్యూనిటీ) పెంపు కోసం సరైన మందులు, సమయానికి చికిత్సతో పాటు సమతుల్య ఆహారం అత్యంత కీలకమని పేర్కొన్నారు. టి.బి నియంత్రణలో పోషకాహారం ప్రధాన పాత్ర పోషిస్తుందని, ఈ దిశగా సహకారం అందించిన గ్రీన్ కో యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, పేషంట్స్ అందుకున్న ఫుడ్ కిట్లను సక్రమంగా వినియోగించుకోవాలని, వృథా చేయకుండా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నిర్దేశిత కాలంలో పూర్తి చికిత్స తీసుకుంటే టి.బి పూర్తిగా నయం అవుతుందని, ప్రతి రోగి వైద్యుల సూచనలు ఖచ్చితంగా పాటించాలని కోరారు. జిల్లాలో టి.బి నిర్మూలన లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం, వైద్యశాఖ, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో డాక్టర్ కామేశ్వర ప్రసాద్, డిస్టిక్ లెప్రసీ, ఎయిడ్స్ మరియు టి.బి. కంట్రోలర్ అధికారి డాక్టర్ భాస్కర్, గ్రీన్ - కో సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ఏ.ఎస్ నాయుడు, జిల్లా క్లస్టర్ హెడ్ బడేషావలి, సీనియర్ జనరల్ మేనేజర్ శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ కొరత లేదు, వాహనదారులు

## ఆందోళన చెంది అవసరానికి మించి కొనుగోలు చేయొద్దు

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 27:- పెట్రోల్, డీజిల్ కొరత లేదు, వాహనదారులు ఆందోళన చెంది అవసరానికి మించి కొనుగోలు చేయొద్దని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి వాహనదారులకు సూచించారు. సోమవారం స్థానిక భూపాల్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న నారాయణమూర్తి పెట్రోల్ బంక్ , అమ్మ హాస్పిటల్ వద్ద ఉన్న రిలయన్స్ పెట్రోల్ బంక్, గుత్తి పెట్రోల్ బంక్ ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 166 పెట్రోల్ బంక్ లు ఉన్నాయన్నారు. ప్రతి పెట్రోల్ పాయింట్ వద్ద విఆర్ఓ లు ఉండి పెట్రోల్ లోడ్ ఎంత వస్తుందనే వివరాలను ఖచ్చితంగా పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. క్యాన్ లు, డబ్బాలు, బ్యారెల్స్ తీసుకొని వస్తే పెట్రోల్ వేయొద్దని కలెక్టర్ షాప్ యాజమాన్యం వారిని ఆదేశించారు. గత 3 రోజుల నుండి చూస్తే ఇప్పుడు కొంచెం జన సమూహం తగ్గిందన్నారు. ఇప్పటి వరకు 15 కేసులు బుక్ చేశామని, 150 లీటరు డీజిల్, 200 లీటర్ల పెట్రోల్ ను సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎూజూ, తదితర ఆయిల్ కంపెనీలతో మాట్లాడం జరిగిందని సాయంత్రం నాటికి 95 నుండి 100 వరకు లోడ్ రావడం జరుగుతుందన్నారు. తద్వారా పరిస్థితి అదుపులోకి వస్తుందన్నారు. అనంతరం కలెక్టర్ అక్కడే ఉన్న వాహనదారులతో మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ కొరత లేదని, ఆందోళన పడి అవసరానికి మించి కొనుగోలు చేయొద్దన్నారు. ఇటువంటి సమయంలో వాహనదారులు కూడా అధికారులకు సహకరించాలని కలెక్టర్ వాహనదారులకు సూచించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పెట్రోల్ బంక్ ల వద్ద జనాన్ని లేదా క్యూ ను నియంత్రించడానికి అవసరమైన పోలీస్ సిబ్బందిని ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డిఎస్ఓ రాజా రఘువీర్, సివిల్ సప్లైస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు

## ప్రజల కోసం చేసిన సేవలు చిరస్మరణీయం



కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 27 : రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ప్రజల కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని, "ప్రజల రాజు" గా ఎదిగారని, ఆయన చేసిన సేవలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి కొనియాడారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల రాజుగా ప్రసిద్ధి చెందిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు గారి జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన్న జిల్లా కలెక్టర్, ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొని మహానుభావుడి సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మకమైన జమీందార్లలో ఒకరని పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలోని అమరావతిని కేంద్రంగా చేసుకుని సుమారు 500 గ్రామాలపై ఆధిపత్యం కలిగి, ప్రజా పరిపాలనలో న్యాయం, ధర్మం, సంక్షేమం అనే విలువలను ఆచరణలో చూపించిన మహానుభావుడని తెలిపారు. 1761 ఏప్రిల్ 27న జగ్గన్న, అచ్చమ్మ దంపతులకు జన్మించిన వెంకటాద్రి నాయుడు, 1783లో పట్టాభిషేకం పొందారు. యుద్ధాలకు దూరంగా ఉండి, ప్రజల మద్దతుతో తన రాజ్యాన్ని విస్తరించుకున్న ఆయన, పన్నుల భారాన్ని తగ్గిస్తూ ప్రజలు తమ వృత్తులను స్వేచ్ఛగా అభివృద్ధి చేసుకునే విధంగా ప్రోత్సహించారు. ధార్మికతకు ప్రాధాన్యం ఇచ్చిన ఆయన, పొన్నూరు, మంగళగిరి, అమరావతి వంటి ప్రాంతాల్లోని దేవాలయాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. అలాగే, తెలుగు, ఇంగ్లీషు భాషలపై పట్టు కలిగి సాంస్కృతిక అభివృద్ధికి కూడా తోడ్పడ్డారు. అమరావతిని ఒక ప్రముఖ పట్టణంగా తీర్చిదిద్దడంలో ఆయన చేసిన కృషి విశేషమని కలెక్టర్ తెలిపారు. వీధులు, కోటలు, భవనాలు నిర్మించడం, వాణిజ్యాన్ని ప్రోత్సహించడం, చెరువులు, కాలువలు నిర్మించి కృష్ణా నది నీటిని సమర్థవంతంగా వినియోగించే విధానాలను అభివృద్ధి చేయడం ద్వారా ప్రాంతీయ అభివృద్ధికి బాటలు వేశారు. ప్రజల సంక్షేమం, న్యాయం, అభివృద్ధి అనే మూడు మూలస్థంభాలపై తన పరిపాలనను నిర్మించిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు గారు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానుభావుడని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (ఇంచార్జి) చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, పర్యాటక శాఖ అధికారి శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, జిల్లా విద్య అధికారి జి. సుధాకర్, పి. వో. ఎస్.ఎస్.సి డాక్టర్ లోకరాజ్, సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో అత్యధిక పెట్రోల్, డీజిల్ స్టాక్ అందుబాటులో ఉంది

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 27:- జిల్లాలో అత్యధిక స్టాక్ ఇప్పుడు మన దగ్గర అందుబాటులో ఉందని, ప్రజలు ఆందోళన చెంది ఎక్కువ మోతాదులో పెట్రోల్ కొనుగోలు చేయొద్దని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పెట్రోల్, డీజిల్ అంశాలపై కలెక్టర్, ఎస్పీ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని పెట్రోల్ మరియు డీజిల్ స్టాక్ వివరాలకు సంబంధించి పెట్రోల్ స్టాక్ రోజువారీ సగటు వినియోగం 2,37,000 లీటర్లన్నారు. ప్రస్తుత నిల్వ 9,16,000 లీటర్లన్నారు. 11,00,000 లీటర్లు ట్రాన్సిట్ (రవాణా లో) ఉందన్నారు. రవాణాలో ఉన్న దానితో కలిపి సుమారు 20,00,000 లీటర్ల స్టాక్ ఉందన్నారు. ఈ నిల్వ సుమారు 9 రోజులకు సరిపోతుందన్నారు. డీజిల్ స్టాక్ కు సంబంధించి రోజువారీ సగటు వినియోగం 3,17,000 లీటర్లన్నారు. బంకుల్లో ఉన్న నిల్వ 5,92,000 లీటర్లన్నారు. ట్రాన్సిట్ (రవాణాలో ఉన్నది) 11,86,000 లీటర్లన్నారు. మొత్తం స్టాక్ సుమారు 17,73,000 లీటర్లన్నారు. ఈ నిల్వ సుమారు 6 రోజులకు సరిపోతుందన్నారు. స్టాక్ పరంగా ప్రస్తుతం ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. సోమవారం ఉదయం తాను, ఎస్పీ కలిసి పెట్రోల్ బంకులను తనిఖీ చేయడం జరిగిందన్నారు. సోమవారం ఉదయానికి దాదాపు 42 బంకులు డ్రై అయిపోయాయన్నారు. మొదటి రోజు 34, మధ్యలో 32, మళ్లీ 42 అయ్యాయన్నారు. ప్రజలు ఆందోళనతో కొనుగోలు చేయడం వల్ల, క్యూలు కట్టి బ్యారెల్స్, టిన్లతో తీసుకెళ్లడం, అలాగే ఫుల్ ట్యాంక్ చేయించుకోవడం వల్ల ఈ సంఘటన జరిగిందన్నారు. కానీ ఇప్పుడు కొంచెం ప్రజల్లో ఆందోళన తగ్గిందన్నారు. ప్రజలు కూడా పరిస్థితిని అర్థం చేసుకున్నారన్నారు.. ఆందోళనతో కొనుగోలు చేయకండి, ఎందుకంటే మన దగ్గర సరిపడా స్టాక్ ఉందన్నారు. ఈ ఆందోళన వల్ల కొనుగోలు చేయడంతో ఆర్టిఫిషియల్ షార్టేజ్ (కృత్రిమ కొరత) ఏర్పడిందన్నారు. తాము నిన్నటి నుండి బీపీసీఎల్, ఎచ్పీసీఎల్ , ఐఓసీఎల్ మరియు జియో, నయారా ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో నిరంతరం మాట్లాడుతున్నామన్నారు. నిన్న సాయంత్రం 110 లోడ్లు పంపిస్తామని చెప్పారన్నారు. ఇప్పటివరకు 81 లోడ్లు డిస్పాచ్ అయ్యాయన్నారు. అందులో 53 లోడ్లు ఇప్పటికే కర్నూలు జిల్లాకు చేరుకున్నాయన్నారు. మిగిలిన 29 లోడ్లు రాత్రి 10 గంటల కల్లా వచ్చేస్తాయన్నారు. సీఎం గారు ఉదయం మరియు సాయంత్రం ఈ అంశం పై టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారన్నారు. కస్టోడియన్ ఆఫీసర్లను ఇప్పటికే పెట్రోల్ బంకుల వద్ద పెట్టామన్నారు. జన సమూహ నిర్వహణ కొరకు పోలీసుల సహకారం కూడా ఉందన్నారు. ప్రధానంగా బ్యారెల్స్ లేదా టిన్లతో వస్తే మాత్రం ఖచ్చితంగా పట్టుకుంటామన్నారు. ఇప్పటికే కేసులు బుక్ చేశామన్నారు. ఇల్లీగల్ స్టాకింగ్ (అక్రమ నిల్వ) చేయవద్దండి, పట్టుకుంటే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కాబట్టి ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మీకు ఎంత అవసరమో అంత తీసుకుని, నింపుకుని వెళ్లాల్సిందిగా కలెక్టర్ తెలిపారు. మొత్తం 166 పెట్రోల్ బంకుల్లో ఉదయం 42 బంకులు డ్రై అవుట్ ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 10కి తగ్గిందన్నారు. మిగిలిన 10 బంకులకు కూడా ఇంధనం రవాణాలో ఉంది, త్వరలోనే అవి కూడా నిండుతాయన్నారు. సేల్స్ ఆఫీసర్లతో నిరంతరం మాట్లాడుతూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం అని కలెక్టర్ వివరించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ప్రజలు కంగారు పడి ఇంధనం అధికంగా కొనడం లాంటివి చేయకూడదన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారమవుతున్నాయన్నారు. దీని వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తడమే కాకుండా, ప్రజల్లో మరింత భయాందోళనలు పెరిగి కొనుగోళ్లకు దారితీసే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితిని అరికట్టడానికి మేము తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరైనా ఇంధనాన్ని నిల్వ చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. అలాగే సోషల్ మీడియాపై కూడా నిఘా ఉంచామన్నారు. ఇంధనం అయిపోతుందనే తప్పుడు వార్తలను ప్రచారం చేయకండన్నారు. కొంతమంది అవగాహన లేక ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ మరియు వాట్సాప్ వంటి మాధ్యమాల్లో ఇలాంటి మెసేజ్‌లను ఫార్వర్డ్ చేస్తున్నారన్నారు. దీనివల్ల పరిస్థితి మెరుగుపడటానికి బదులు మరింత క్లిష్టంగా మారుతుందన్నారు. మన వద్ద డీజిల్, పెట్రోల్ నిల్వలు సరిపడా ఉన్నాయన్నారు.. ప్రజలు తమకు ఎంత అవసరమో అంతే ఇంధనాన్ని తీసుకోవాలన్నారు. ప్రజలు ట్యాంకులు, డ్రమ్ములు నింపేయడం వల్ల బంకుల్లో కొరత ఏర్పడుతోందన్నారు. ప్రజలు సహకరిస్తే రెండు మూడు రోజుల్లో పరిస్థితి మళ్ళీ సాధారణ స్థితికి వస్తుందన్నారు. ఎవరైనా కావాలని తప్పుడు వార్తలు సృష్టించి, శాంతిభద్రతల సమస్యలు తలెత్తేలా చేసినా లేదా పెట్రోల్ బంకుల వద్ద గొడవలకు దిగినా వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా పరిస్థితి నియంత్రణలో ఉందని తెలిపారు. సాధారణ రోజుల్లో సుమారు 7 లక్షల లీటర్ల స్టాక్ ఉండగా, రోజుకు 2.50 లక్షల లీటర్ల సరఫరా జరిగేదని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం సుమారు 20 లక్షల లీటర్ల వరకు నిల్వ ఉంచామని, రోజువారీ సరఫరా 3 లక్షల నుండి 4 లక్షల లీటర్ల వరకు జరుగుతోందని వెల్లడించారు. సాధారణ స్థాయితో పోలిస్తే పెట్రోల్ నిల్వలు సుమారు నాలుగు రెట్లు, డీజిల్ నిల్వలు మూడు రెట్లు ఉన్నట్లు తెలిపారు. . ఈ రోజు ఉదయం వరకు పనిచేయని కొన్ని బంకులు ఉన్నప్పటికీ, రేపటి లోపు అన్ని బంకులను తిరిగి సాధారణ కార్యకలాపాల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న 20 లక్షల లీటర్ల స్టాక్‌కు అదనంగా మరొక 5 లక్షల లీటర్ల పెట్రోల్, అలాగే డీజిల్ నిల్వలను కూడా పెంచుతున్నామని పేర్కొన్నారు. ఈ నిల్వలతో జిల్లాలో 6 నుండి 7 రోజుల వరకు సరఫరా నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కూడా సమృద్ధిగా నిల్వలు ఉన్నాయని, ముఖ్యమంత్రి నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో సుమారు 23 రోజుల వరకు సరిపడే స్టాక్ అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారని చెప్పారు. గత మూడు నాలుగు రోజులుగా కొంతమంది వ్యక్తులు డబ్బాలలో పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకోవడం వల్ల తాత్కాలిక కొరత ఏర్పడిందని, అయితే పోలీస్, రెవెన్యూ తదితర శాఖల సమన్వయంతో పరిస్థితి నియంత్రణ లో ఉందని జాయింట్ కలెక్టర్ వెల్లడించారు.

## విద్యుత్ కొనుగోలు ఛార్జీలను యూనిట్‌కు రూ.4.60కు తగ్గించేలా ప్రణాళికలు

అమరావతి, మహి న్యూస్, ఏప్రిల్ 27: ప్రజా ప్రయోజనాల కోసమే సంస్కరణలు తెస్తున్నామని ఆ సంస్కరణల అమలు కోసం టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించు కోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేసే అంశంపై నిరంతరం అధ్యయనం, జరుగుతూనే ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ పై సీఎం చంద్రబాబు సమీక్షించారు. వేసవిలో విద్యుత్ సరఫరా, 2026-27 ఏడాదిలో పవర్ ప్రొక్యూర్మెంట్ ప్లాన్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలు వంటి అంశాలపై చర్చించారు. వేసవిలో ప్రతి రోజూ 275 నుంచి 285 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉంటుందని అంచనా వేసినట్టు అధికారులు చెప్పారు. ఈ నెలలో ఇప్పటి వరకు 6397 మిలియన్ యూనిట్ల విద్యుత్ ను వినియోగించు కున్నామని వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే సుమారు 14 శాతం మేర విద్యుత్ వినియోగం పెరిగిందని తెలిపారు. విద్యుత్ వినియోగం పెరగడానికి వేసవితో పాటు పారిశ్రామిక వినియోగం కూడా పెరిగిందని అధికారులు వివరించారు. వచ్చే ఆరు నెలల కాలానికి విద్యుత్ కొనుగోళ్ల ప్రణాళికలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. ఏప్రిల్ 2025లో విద్యుత్ కొనుగోలు ధర రూ. 5.20 ఉండగా.. మార్చి 2026 నాటికి రూ. 4.90కు తగ్గించామని అధికారులు చెప్పారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలవుతున్న తీరును అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

### పునరుత్పాదక విద్యుత్ పై దృష్టి

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."విద్యుత్ కొనుగోళ్ల వ్యయం తగ్గాలి. ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో.. అలాంటి చర్యలన్నింటి పైనా అధికారులు దృష్టి పెట్టాలి. విద్యుత్ రంగంలో ఏయే దేశాల్లో ఎలాంటి కొత్త ఆవిష్కరణలు అమలు అవుతున్నాయో అధ్యయనం చేయాలి. ఈ ఏడాది చివరి నాటికి విద్యుత్ కొనుగోలు ధరను రూ. 4.60కు తగ్గించాలి. ఈ దిశగా విద్యుత్ శాఖాధికారులు దృష్టి సారించాలి. విద్యుత్ రంగంలో సహా ఏ రంగంలో నైనా ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతోనే సంస్కరణలు అమలు చేస్తున్నాం. ప్రజలకు మేలు చేయాలంటే టెక్నాలజీ వినియోగం అత్యంత అవసరం. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ నిరంతరం గుర్తు చేసుకోవాలి. విద్యుత్ లో రీసెర్చ్ అండ్ అనాలసిస్ కు పెద్ద పీట వేయాలి. దీని కోసం ట్రాన్స్ కో, జెన్కో వంటి సంస్థలు తమకున్న సీఎస్సార్ నిధులు కేటాయించాలి. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం నుంచి బడ్జెట్ కేటాయింపులు జరిపేలా చర్యలు తీసుకుంటాం. పంప్డ్ స్టోరేజీ విధానంలో విద్యుత్ ఉత్పత్తిపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి. ఎనర్జీ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. పొల్యూషన్ తగ్గేలా... పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాలి. 2028-29 నాటికి సగాని పైగా విద్యుత్ ఉత్పత్తి రెన్యూవబుల్ ఎనర్జీ ద్వారా వచ్చేలా చూడాలి. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 52396 సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు ఇచ్చాం. దీన్ని మరింత వేగంవంతం చేయాలి. ఇకపై ప్రతి నెల 2 లక్షల పీఎం సూర్య ఘర్ కనెక్షన్లు ఇచ్చేలా చూడాలి. పీఎం కుసుమ్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 2.94 లక్షల కనెక్షన్లు ఇచ్చాం. మొదటి విడత పీఎం కుసుమ్ పథకాన్ని డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలి. ఇక ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, కొనుగోళ్లపై పెద్ద ఎత్తున ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి." అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, విద్యుత్, ట్రాన్సుకో, జెన్కో, వివిధ డిస్కంలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డీజిల్ కోసం ఆందోళన అవసరం లేదు



గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 27 : జిల్లాలో సరిపడా నిలువలు ఉన్నాయని, డీజిల్ కోసం ఆందోళన అవసరం లేదని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ స్పష్టం చేశారు. జిల్లాలో ఇంధన సమస్యపై వస్తున్న వార్తల పట్ల సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ వివరించారు. నగరం పాలెం భారత్ పెట్రోల్ బంకును, వెంకటప్పయ్య కాలనీ లోని హెచ్.పి పెట్రోల్ బంకును స్వయంగా తనిఖీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ప్రజలకు అవసరమైన మేరకు ఇంధన సరఫరా నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు అపోహలకు లోనుకావద్దని కోరారు. పెట్రోల్ బంకుల్లో సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తూ ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. జిల్లాలో సరాసరిన రోజుకు 450 నుండి ఐదు వందల కిలో లీటర్ల విక్రయాలు జరుగుతాయని, అయితే గత రెండు రోజులుగా రోజుకు ఏడు వందల నుండి ఎనిమిది వందల కిలో లీటర్ల విక్రయాలు జరిగాయని తెలిపారు. వెయ్యి కిలో లీటర్ల డీజిల్, ఏడు వందల కిలో లీటర్ల పెట్రోల్ సోమవారం నాటికి హెచ్.పి.సి.ఎల్, ఐ.ఓ.సి.ఎల్, బి.పి.సి.ఎల్ కంపెనీల నుండి సరఫరా అయిందన్నారు. ఆదివారం నాటికి డ్రై అవుట్ అని 85 బంకులు బోర్డులు పెట్టినట్లు గమనించడం జరిగిందని, అన్ని బంకులకు ఇంధనం సరఫరా చేయడం జరిగిందని, సాయంత్రం 6 గంటల వరకు 49 బంకులలో డ్రై అవుట్ పరిస్థితి ఉందని, రెండు, మూడు గంటలలో వాటికి కూడా సరఫరా అయ్యేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ముఖ్యమంత్రి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఈ అంశంలో ప్రత్యేక చొరవతో పనిచేస్తూ, ఆదేశాలు జారీ చేస్తున్నారని అన్నారు. మంగళ వారం ఉదయం నాటికి అన్ని బంకులు పూర్తి స్థాయిలో పని చేయుటకు కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా సమస్యలు ఉంటే ఆయిల్ కంపెనీ వారిని సంప్రదించి స్టాక్ ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి బంక్ వద్ద ఒక రెవిన్యూ ఉద్యోగిని, ఒక పోలీసు కానిస్టేబుల్ ను నియమించి పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. జాయింట్ కలెక్టర్, పోలీస్ సూపరింటెండెంట్ ఆకస్మిక తనిఖీలు చేసి పరిశీలించడం జరిగిందన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. బంకులలో నిల్వలను అనుసరించి ముందుగా ఇండెంట్ లు పెట్టి ఇంధనం సరఫరా అయ్యేటట్లు చూస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎంత అవసరమో అంతే కొనుగోలు చేయాలని, భయాందోళనలతో అధికంగా కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రైతులకు, అత్యవసర సేవలకు ఇంధనం పంపిణీలో ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశామని చెప్పారు. కనిష్ట నిలువలు ఉన్నా విక్రయాలు చేయాలని బంకులకు ఆదేశాలు జారీ చేశామని అన్నారు.

### సోషల్ మీడియాలో కథనాలపై నిఘా

సోషల్ మీడియాలో వచ్చే కథనాల పట్ల నిఘా పెట్టడం జరిగిందని వివరించారు. వచ్చిన పోస్టులను పోలీసు సూపరింటెండెంట్ కు పంపించామని, తక్షణ చర్యలకు ఉపక్రమించడం జరిగిందని చెప్పారు. పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ భయంతో కొనుగోలు వద్దని కోరారు.

# జలధార - జలహారతికి ఫీడర్ కాలువుల పునరుద్ధరణ ప్రధానం




గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 27 : జలధార - జలహారతి కార్యక్రమంలో ఫీడర్ కాలువుల పునరుద్ధరణ ప్రధానమని పంచాయతీ రాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ శివప్రసాద్ అన్నారు. జలధార - జలహారతి అవగాహన, శిక్షణ కార్యక్రమం ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జలవనరుల శాఖ ఇంజనీర్లు, నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం జలధార - జలహారతి ఏప్రిల్ 6 నుండి జూలై 14 వరకు వంద రోజుల కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరిగిందన్నారు. సరయిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, సరయిన పనులు చేపట్టాలని సూచించారు. సమగ్రమైన పనులు నాణ్యతతో చేపట్టాల్సి ఉందని చెప్పారు. ప్రాణికోటికి నీరు అవసరం అన్నారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన నీటిని అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. రాష్ట్రంలో 38 వేల చెరువులు ఉన్నాయని, వీటితో పాటు ఇంకా అనేక జలవనరుల ప్రదేశాలు ఉంటాయని చెప్పారు. 14 వేల ఆరు వందల చెరువులను పూర్తి స్థాయిలో నింపగలుగుతున్నామని తెలిపారు.

### 3,300 చెరువులకు నీరు రావడం లేదని,

4,600 చెరువులలో 25 శాతం మాత్రమే నిండుతున్నాయని వివరించారు. చెరువులకు వచ్చే కాలువలు వివిధ కారణాల వలన ప్రక్కకు మళ్ళించి ఉండవచ్చని, వాటిని గుర్తించి తిరిగి యథా స్థితికి తీసుకురావాలని చెప్పారు. 6.80 లక్షల జల సంరక్షణ పనులను జల వనరుల శాఖ గుర్తించిందన్నారు. మరమ్మతులు మాత్రమే కాకుండా కొత్త పనులు కూడా చేపట్టవచ్చని తెలిపారు. పచ్చదనం పెంచే పనులు చేయవచ్చని పేర్కొన్నారు. ఫీడర్ కాలువులు సక్రమంగా పారుటకు నిర్మాణాల నాణ్యతలో పక్కాగా ఉండాలని చెప్పారు. అన్ని చిన్న నీటిమడుగుల పునరుద్ధరణ, ఫీడర్ కాలువల మరమ్మత్తులు, నీటి వనరుల అనుసంధానం, వరద నీటి వినియోగం

### మట్టి మరియు నీటి సంరక్షణ పనులు,

రిడ్జ్ టు వ్యాలీ పద్ధతి అమలు, పచ్చదనం పెంపు, కొత్త నీటి నిల్వ నిర్మాణాలు, టెక్నాలజీ వినియోగం, చెరువుల ఫీడర్ ఛానల్స్ శుభ్రపరచడం, గట్లను బలోపేతం చేయడం, చెరువులను సమీపంలోని కాలువలు లేదా వాగులతో అనుసంధానించడం, మొక్కల పెంపకం, కొత్త నీటి సంరక్షణ నిర్మాణాల ఏర్పాటు, గ్రామ నీటి బడ్జెట్ తయారీ తదితర అంశాలను చేపట్టడం జరుగుతుందని అన్నారు. జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ రమేష్ మాట్లాడుతూ జలధార - జలహారతి పనుల గుర్తింపు, మంజూరు, అమలు చేయాలన్నారు. జల వనరులను పరిరక్షించడం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. భూగర్భ జలాలు పెంచాలని, గొలుసుకట్టు చెరువులను నింపాలని అన్నారు. ఉపాధి హామీ అనుసంధానంతో పనులు చేపట్టాలని నిర్దేశించడం జరిగిందని చెప్పారు. ప్రజల భాగస్వామ్యం ఎక్కువగా ఉండేటట్లు చూడాలని అన్నారు. వర్షాకాలం తరువాత కూడా భూగర్భ జలాలు మూడు మీటర్లు మేర ఉండాలనేది ఆశయం అన్నారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు మాట్లాడుతూ సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని అన్నారు. నీటి కొరత ఉన్న గ్రామాలు గుర్తించి అటువంటి చోట పనులు చేయుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. భూగర్భ జల శాఖ ఉప సంచాలకులు వందనం మాట్లాడుతూ నీరు ప్రాణాధారం అన్నారు. భూగర్భ జలాలను కాపాడుకోవాలని చెప్పారు. ప్రతి కుటుంబం ఏడాదికి సరాసరిన రెండు లక్షల లీటర్లు వినియోగిస్తుందని, అయితే కనీసం పది వేల లీటర్లు భూమిలోకి పంపించే చర్యలు చేపట్టడం లేదన్నారు. గుంటూరు జిల్లాలో 40 గ్రామాల్లో 6 మీటర్ల కంటే లోతులో ఉందన్నారు. ఆ గ్రామాలపై దృష్టి సారించాలని కోరారు. జిల్లాలో 37 పీజియో మీటర్లు, 29 అబ్జర్వేషన్ వెల్స్ ఉన్నాయని, తద్వారా భూగర్భ జలాల పరిశీలన చేస్తున్నామని అన్నారు. చేబ్రోలు మండలం చేకూరు గ్రామంలో మాత్రమే 11.37 మీటర్ల మేర జలాలు అందుబాటులో ఉందని చెప్పారు. ఐదు మండలాల్లో ఆరు మీటర్ల కంటే లోతులో నీరు లభ్యం అవుతుందని తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలో చెరువుల పూడికలు తీయడం, గట్లను బలోపేతం చేయడంతో భూగర్భ జలాలు పెరిగాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, బాపట్ల జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి, పల్నాడు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం. సిద్ధలింగ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఐఓసీఎల్, హెచ్పీసీఎల్, బీపీసీఎల్, నయారా, పెట్రోల్ బంకుల సేల్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్

### డిమాండ్ కు తగినట్లు పెట్రోల్, డీజల్ స్టాక్ ను తెప్పించుకోవాలి

### జిల్లా కలెక్టర్లిడాక్టర్ ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి,మహి న్యూస్ ఏప్రిల్ 27: పెట్రోల్ బ్యాంక్ లలో డిమాండ్ కు తగినట్లు పెట్రోల్ మరియు డీజల్ స్టాక్ తెప్పించుకోవాలని ఐఓసీఎల్, హెచ్పీసీఎల్, బీపీసీఎల్, నయారా పెట్రోల్ బంకుల సేల్స్ అధికారులతో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు ఐఓసీఎల్, హెచ్పీసీఎల్, బీపీసీఎల్, నయారా పెట్రోల్ బంకుల సేల్స్ అధికారులతో జిల్లా ఎస్పి ఎల్ సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు లతో కలసి జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెట్రోల్ బంక్ ల వద్ద స్టాక్ లేదని బోర్డులు పెడుతున్నారని, అవసరానికి తగినట్లుగా ముందుగా ఆయిల్ ట్యాంకర్ లను తెప్పించుకుని పెట్రోల్ బంక్ ల వద్ద స్టాక్ ఉంచుకోవాలన్నారు. పెట్రోల్ కొరత కారణంగా పెట్రోల్ బ్యాంక్ లు మూతపడే పరిస్థితి ఉండకూడదన్నారు. ప్రజలందరికీ వారి నిత్యావసరాలకు అవసరమైన మేరకు పెట్రోల్ మరియు డీజల్ ను ఆయిల్ కార్పొరేషన్ ల ద్వారా సమన్వయం చేసుకుని ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించుకుంటూ పెట్రోల్, డీజల్ నిల్వలు ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో సివిల్ సప్లి అధికారి శేషాచాల రాజు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పోజిటివ్ పెర్సేప్షన్ స్కోర్ పెరగాలి

### ఈ నెల 30 లోగా ప్రతి ఒక్కరూ స్వేయ గణన చేయాలి

చిత్తూరు, మహి న్యూస్, ఏప్రిల్ 27 : పి.జి.ఆర్.ఎస్ లో అందిన అర్జీలకు స్పీకింగ్ ఆర్డర్ లో ఎండార్స్మెంట్ ఉండాలని, సరైన సమాధానం ఇవ్వని వారిపై చర్యలు తప్పవని డిఆర్ఓ కే మోహన్ కుమార్ పేర్కొన్నారు సోమవారం పి.జి.ఆర్.ఎస్ సమీక్ష లో భాగంగా వినతుల పరిష్కారం, పబ్లిక్ పెర్సెప్షన్ , రీ సర్వే , వాట్సప్ గవర్నెన్స్ , స్వేయ గణన , ఫ్యామిలీ సర్వే, పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఉన్నతాధికారులతో, ఆర్డీవోలతో, ఎంపీడీఓలతో, ఎమ్మార్వోలతో సమీక్షించారు ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ప్రతి వారం కాంపెయిన్ కార్యక్రమాల పై పబ్లిక్ పోజిటివ్ పెర్సేప్షన్ జరుగుతుందని, ఈ కార్యక్రమం లో మన జిల్లా స్కోర్ పెరగాలని తెలిపారు. గత వారం కాంపెయిన్ లో ఆయా అధికారులు స్కోర్ మెరుగుపడేలా చూడాలని అన్నారు. వాట్సప్ గవర్నెన్స్ పై ఎం.పి.డి.ఓ లు శ్రద్ధ పెట్టాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ నెల 30 లోపల స్వేయ గణన చేసుకోవాలని జిల్లాలో ఈ కార్యక్రమం బాగానే జరుగుతున్నప్పటికీ ఇంకా మెరుగు పడాలని తెలిపారు. స్వయం సహాయక సభ్యులకు అవగాహన కల్పించి స్వేయ గణన జరిగేలా చూడాలని, డి.ఆర్.డి.ఏ పి.డి. కి సూచించారు. ఉపాధ్యాయులంతా వారి కుటుంభ సభ్యులతో కూడా స్వేయ గణన చేసుకునేలా చూడాలన్నారు. ఉపాధి కార్మికులతో డ్వామా పి.డి. అలాగే అందరు అధికారులు శత శాతం స్వేయ గణన చేసుకోవాలని తెలిపారు.

## ఘనంగా అమరావతి ప్రభువు వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు 266వ జయంతి

నింద్ర, మహి న్యూస్, ఏప్రిల్ 27 : అమరావతి ప్రభువు వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు 266వ జయంతిని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నింద్ర మండలం ఎంపీడీవో కార్యాలయం నందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూవాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ప్రజాహిత పాలన, ధార్మికత, అభివృద్ధి దృక్పథం నేటి తరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. సమాజ సంక్షేమం కోసం ఆయన చూపిన దారిని అనుసరించడం అవసరమని తెలిపారు. వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు (27 ఏప్రిల్ 1761 -- 17 ఆగస్టు 1817) ఆంధ్రదేశ చరిత్రలో అపూర్వమైన జమీందారు, పరిపాలనలో దిట్ట అన్నారు. గుంటూరు, కృష్ణా ప్రాంతాలను సమర్థంగా పరిపాలిస్తూ శాంతి భద్రతలను బలోపేతం చేసి ప్రజల విశ్వాసాన్ని పొందారని చెప్పారు. ఆయన పాలనలో వ్యవసాయం విస్తృతంగా అభివృద్ధి చెందిందన్నారు. అమరావతిని రాజకీయ, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దిన మహానుభావుడిగా ఆయన చరిత్రలో చిరస్థానం సంపాదించారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అమరేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధిలో విశేష పాత్ర పోషించడంతో పాటు మంగళగిరి, చెబ్రోలు, పొన్నూరు ప్రాంతాల్లో మూడు వందలకు పైగా దేవాలయాలను నిర్మించి, పునరుద్ధరించారన్నారు. 108 దేవాలయాలలో ఒకేసారి ధ్వజస్తంభాలను ప్రతిష్ఠించి అరుదైన చరిత్ర సృష్టించారని తెలిపారు. వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ప్రజాహిత పాలన, న్యాయబద్ధత, పారదర్శకతకు ప్రతీకగా నిలిచారని అభిప్రాయపడ్డారు. డిఆర్ఓ మోహన్ కుమార్ మాట్లాడుతూ ఆయన చేసిన సేవలు నేటికీ ఆదర్శప్రాయంగా నిలుస్తూ సమాజ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఏ .రాజేంద్రన్, ట్రైనింగ్ కలెక్టర్ వెంకటేష్, నగిరి ఆర్డీవో అనుపమ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు జీవనాడి పశువుల పెంపకం


### ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి



రాయచోటి, మహిన్యూస్, ఏప్రిల్ 27 : పశువుల పెంపకం రైతులకు జీవనాడి లాంటిదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి అన్నారు. ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా సోమవారం రాయచోటి ఏరియా పశు వైద్యశాలలో రైతు సంఘం ఆధ్వర్యంలో పశువైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ పశువైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివారెడ్డి మూగజీవాలకు చేస్తున్న సేవలను కొనియాడారు. మూగజీవాలు తమకు వచ్చిన బాధను చెప్పలేవని, వాటి బాధను అర్థం చేసుకొని వాటికి చికిత్స చేయడం గొప్ప పుణ్య కార్యక్రమమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఏరియా అధ్యక్షుడు హరినాధ నాయుడు, రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా దివంగత వైయస్ అభిషేక్ రెడ్డి 38 వ జన్మదిన వేడుకలు

### వైఎస్ఆర్సిపి యువజన విభాగం అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి



పులివెందుల మహి న్యూస్ ఏప్రిల్ 27: దివంగత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ అభిషేక్ రెడ్డి 38 వ జయంతిని వీరనారాయణ అంధుల అనాథ ఆశ్రమంలో వైయస్ అభిషేక్ రెడ్డి జన్మదిన వేడుకలు వైఎస్సార్సీపి పులివెందుల నియోజకవర్గం అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి యువనాయకులు మహేష్ రెడ్డి,రాజేష్,ప్రదీప్ ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, షమీవుల్లా ,చంద్ర మౌళి, కనక,షాను,నాగరాజు యువ నాయకులు నంద,హరి,రఫీ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరతపై వదంతులు నమ్మవద్దు

## జిల్లాలో తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయి

### ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్

### సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాంలి

### జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు



తిరుపతి, మహి న్యూస్,ఏప్రిల్ 27: జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న వదంతుల నేపథ్యంలో కొన్ని పెట్రోల్ బంకుల వద్ద భారీ క్యూలు ఏర్పడినప్పటికీ, జిల్లాలో ఇంధన కొరత లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. ప్రజలు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని, అవసరానికి మించి ఇంధనం నిల్వ చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. గత రెండు మూడు రోజులుగా కొంతమంది బల్క్ వినియోగదారులు రిటైల్ అవుట్లెట్లలో ఇంధనం కొనుగోలు చేయడం, అలాగే సోషల్ మీడియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా రాబోయే రోజుల్లో కొరత ఏర్పడుతుందన్న తప్పుడు ప్రచారం వల్ల ఒకేసారి డిమాండ్ పెరిగిందన్నారు. దీనివల్ల కృత్రిమంగా డిమాండ్--సప్లై మధ్య తాత్కాలిక అసమతౌల్యం ఏర్పడిందని తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జిల్లా



యంత్రాంగం వెంటనే అప్రమత్తమై రెవెన్యూ, సివిల్ సప్లైస్, పోలీస్ శాఖలతో కలిసి అన్ని పెట్రోల్ బంకులను తనిఖీ చేసిందన్నారు. ప్రజలకు తగిన భరోసా కల్పిస్తూ, జిల్లాలో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని వివరించామని చెప్పారు. జిల్లాలోని మొత్తం 189 పెట్రోల్ బంకుల్లో తాత్కాలికంగా మూతపడిన 26 బంకులకు సాయంత్రం నాటికి సరఫరా పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి బంకు వద్ద పోలీస్, రెవెన్యూ సిబ్బందిని మోహరించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షణ చేపట్టామన్నారు. కలెక్టరేట్‌లో 24ఇ7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి హెచ్పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్, నయారా, రిలయన్స్ సంస్థల జిల్లా ప్రతినిధులతో నిరంతరం సమీక్ష నిర్వహిస్తున్నామని, తిరుమలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అక్కడి రెండు బంకులకు అదనపు సరఫరాలు పంపించామని, అలాగే నాయుడుపేట, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో వ్యవసాయ అవసరాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, డీజిల్ జనరేటర్లకు ప్రాధాన్యతా క్రమంలో ఇంధనం అందిస్తున్నామని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసి ప్రజల్లో ఆందోళన సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరోసారి ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, జిల్లాలో తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని, అనవసరంగా పెట్రోల్ బంకుల వద్ద క్యూలలో నిలబడాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు మాట్లాడుతూ....జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలపై సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని జిల్లా ఎస్పీ సూచించారు. జిల్లాలో అవసరానికి సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలోని మొత్తం 189 పెట్రోల్ పంపుల్లో ప్రస్తుతం కేవలం 26 పంపుల్లో మాత్రమే తాత్కాలికంగా సరఫరా అంతరాయం ఏర్పడిందని తెలిపారు. ఆ పంపులకు కూడా ఈరోజు సాయంత్రం 3 నుండి 4 గంటల మధ్యలో సరఫరా చేరేలా చర్యలు తీసుకున్నామని, సాయంత్రం నాటికి అన్ని పెట్రోల్ పంపులు పూర్తిస్థాయిలో పనిచేస్తాయని వెల్లడించారు. ప్రజలు అవసరానికి మించి పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించవద్దని, అలా చేయడం వల్ల కృత్రిమంగా డిమాండ్ పెరిగి కొన్ని చోట్ల క్యూలు ఏర్పడే పరిస్థితి వస్తుందని అన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ అవసరానికి తగినంత మాత్రమే వినియోగించి సహకరించాలని కోరారు. ఇంధన సరఫరాపై ఎటువంటి కొరత లేదని, జిల్లాలో తగినంత నిల్వలు ఉన్నాయని మరోసారి స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసి వదంతులు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

## మే 5 నుండి 13 వరకు శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతర నిర్వహణ...

### అంగరంగ వైభవంగా జాతర నిర్వహణకు చర్యలు చేపట్టండి..

### ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష.



తిరుపతి,మహి న్యూస్ , ఏప్రిల్ 27: మే 5 తేదీ నుంచి 13 వ తేదీ వరకు జరిగే శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా ఎస్పి ఎల్ సుబ్బరాయుడు, జె సి ఆర్. గోవిందరావు, తాతయ్య గుంట గంగమ్మ దేవస్థానం బోర్డు ఛైర్మన్ ఎన్. మహేష్ యాదవ్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బ్యూటిఫికేషన్ మరియు గ్రీనరీ కార్పొరేషన్ ఛైర్మన్ సుగుణమ్మ లతో కలసి తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మే 5 తేదీ నుంచి 13 వ తేదీ వరకు జరిగే



శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతరకు వేలాదిగా భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలి వచ్చే అవకాశం ఉన్నందున భక్తుల రద్దీకి తగినట్లు సౌకర్యాలను కల్పించాలన్నారు. అలాగే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా దర్శన సౌకర్యాలు ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో ఈ ఏడాది సమర్థవంతంగా ఏర్పాట్లను చేపట్టాలని అధికారులకు సూచించారు. జాతర సందర్భంగా శానిటేషన్ నిర్వహణ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. క్యూ లైన్ నియంత్రణ, పట్టణంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. వాటిని కంట్రోల్ రూంతో అనుసంధానం చేసుకుని పర్యవేక్షించాలన్నారు. పార్కింగ్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, పోలీస్ బందోబస్తు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు, అంబులెన్స్ లు అందుబాటులో ఉంచాలన్నారు. తాగునీరు, మజ్జిగ అందించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ఫైర్ సేఫ్టీ, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ అనౌన్స్మెంట్, రవాణా సౌకర్యం తదితర అంశాలపై ప్రణాళిక బద్ధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

### గంగమ్మ జాతర ఉత్సవములు వివరాలు

మే 5 మంగళవారం చాటింపు, 6వ తేదీ బుధవారం బైరాగి వేషశ్, 7 వ తేది గురువారం బండ వేషశ్, 8వ తేది శుక్రవారం తోటి వేషశ్, 09 వ తేది శనివారం దొర వేషం, 10 వ తేదీ ఆదివారం మాతంగి వేషం, 11 వ తేది సోమవారం సున్నపు కుండలు, 12 వ తేది మంగళవారం గంగమ్మ జాతర సప్పరం, పేరంటాళ్ల వేషం, మే 13 వ తేది బుధవారం విశ్వరూప దర్శనం.

## మే 2 నుండి 8 వరకు వైభవంగా పదకవితా పితామహుడు

### అన్నమయ్య 618వ జయంతి ఉత్సవాలు

తిరుపతి/రాజంపేట. మహి. న్యూస్. ఏప్రిల్ :27: తాళ్లపాక, రాజంపేట, తిరుపతిలో ఆధ్యాత్మిక కళోత్సవాల సందడి సంకీర్తనలతో శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన పదకవితా పితామహుడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులవారి 618వ జయంతి ఉత్సవాలు మే 2 నుండి 8వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. అన్నమయ్య జన్మస్థలమైన తాళ్లపాకలోని ధ్యానమందిరం, రాజంపేటలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద, తిరుపతిలోని మహతి కళాక్షేత్రం, అన్నమాచార్య కళామందిరంలలో జయంతి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

### తాళ్లపాకలో..

తాళ్లపాకలోని ధ్యానమందిరంలో మే 2వ తేదీన ఉదయం 9 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. మొదటగా అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు మరియు స్థానిక కళాకారులచే సప్తగిరి సంకీర్తన గోష్ఠిగానం నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీవారి కల్యాణం కన్నుల పండుగగా జరుగనుంది. ఇందులో భాగంగా మే 2 నుండి 8వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు గాత్ర సంగీతం, హరికథ, నృత్య, నాటక ప్రదర్శన




కార్యక్రమాలు జరుగనున్నాయి.రాజంపేటలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద మే 2వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు ఊంజల్ సేవ జరుగనుంది. అదేవిధంగా మే 2 నుండి 8వ తేదీ వరకు సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు సంగీత, వాద్య, హరికథ కార్యక్రమాలు జరుగనున్నాయి.

### తిరుపతిలో..

తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో మే 2వ తేదీ ఉదయం 9 గంటలకు సప్తగిరి సంకీర్తన గోష్ఠిగానంతో జయంతి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఉదయం 10 నుండి 11.30 గంటల వరకు సంగీత సభ, ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు హరికథ గానం జరుగనుంది. మే 3 నుండి 7వ తేదీ వరకు ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు సాహిత్య సదస్సులు జరుగనున్నాయి. మే 8వ తేదీ ఉదయం 8 గంటలకు శ్రీ కోదండరామస్వామివారి ఆస్థానం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు సంగీత సభ, హరికథ గానం జరుగనుంది. ఇందులో భాగంగా మే 2 నుండి 8వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు గాత్ర సంగీతం, నృత్య, వాద్య, హరికథ కార్యక్రమాలు జరుగనున్నాయి. మహతి కళాక్షేత్రంలోనూ మే 2 నుండి 8వ తేదీ వరకు సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు సంగీత, నృత్య, వాద్య కార్యక్రమాలు జరుగనున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నమయ్య సంకీర్తనల సౌరభాన్ని ఆస్వాదించాలని టిటిడి విజ్ఞప్తి చేస్తోంది. టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారిచే జారీ చేయబడినది.

## దళితుని భూమి పై కన్నేసిన వారిపై చర్యలకు డిమాండ్



వైయస్సార్ కడప జిల్లా (మహి న్యూస్, ఏప్రిల్ 27): కడప జిల్లా చాపాడు మండలం బద్రిపల్లె కు చెందిన మాల కులానికి చెందిన దేగల ఆశీర్వాదం భూమి పై కన్నేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జి చెన్నయ్య వర్గం, కడప జిల్లా అధ్యక్షులు జేష్ఠది భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం తన వర్గం సభ్యులతో చాపాడు తహశీల్దార్ రామ కమారి ని గౌరవప్రదంగా కలిశారు. బద్రి పల్లెలో దేగల ఆశీర్వాదం కు చెందిన సుమారు రెండు ఎకరాల పై చిలుకు భూమిని ఇటీవల కాలువ గుర్రప్ప పేరుతో రిజిస్ట్రేషన్ చేయడాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు తహశీల్దార్ తన ప్రమేయం లేదని సంబంధిత పత్రాలతో పాటు కోర్టు ఇంజెక్షన్ ఆర్డర్ కాపీ తో రిజిస్ట్రేషన్ రద్దు కోసం ప్రయత్నించ వచ్చని సూచించారు. అనంతరం జేష్టాది భాస్కర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2012 మార్చి 3 వ తేదీన దేగల ప్రభుదానము కాల్వ గురప్ప కి ఆయికం రిజిస్టరు, మూడు సంవత్సరాల కాల వ్యవధికి చేయించారని తెలిపారు. మూడు నెలలు గడువు ఉండగా, తీసుకున్న డబ్బు ఇవ్వడానికి వెళితే, రివర్స్ అయి, భూమి ఆక్రమించుకోవాలని, చూస్తున్న కాల్వ గుర్రప్ప, రాజకీయంగా అధికారుల అండదండలతో రిజిస్ట్రేషన్ పత్రాలు ఇవ్వకుండా నానా తిప్పలు పెడుతూ ఉండడం, దళితులు ఏం చేస్తారులే నాకు అధికార బలం ఉంది డబ్బు బలం ఉంది అని, మొత్తానికి ఆన్లైన్ ఎక్కించుకున్నారని తెలిపారు. విలువ గల భూమి మీద కన్నేశాడని దీంతో బాధితులు కోర్టులో ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారని వివరించారు. కోర్టు పెండింగ్ లో ఉన్న చుక్కల భూమిని, వీఆర్వో, ఆర్ ఐ ఎమ్మార్వో, లు ఆన్ లైన్ లో ఎలా ఎక్కిస్తారని వివరణ కోరగా, తాసిల్దార్ ఇంజక్షన్ ఆర్డర్ తీస్తే, ఆన్లైన్ తీసేస్తామని, వివరణ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధితులు దేగల ఆశీర్వాదం, ఆశీర్వాదం భార్య కుమారుడు కడప జిల్లా మాల మహానాడు యువజన సంఘం అధ్యక్షులు రాజేష్, జమ్మలమడుగు నియోజకవర్గ అధ్యక్షులు రాజశేఖర్, ప్రొద్దుటూరు యూత్ ప్రెసిడెంట్, జాస్వర్, శరబుద్దిన్, వల్లి, తదితరులు పాల్గొన్నారు.



RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com



# నిత్య పూజ కోనలో శుభ్రత పరిశుభ్రత



## తగ్గిన భక్తుల రద్దీ
## లంకమల అటవీ ప్రాంతంలో
## ఫారెస్ట్ సిబ్బంది కూంబింగ్

సిద్ధవటం ఏప్రిల్ 27. మహీన్యూస్ : లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్య పూజ స్వర కోన పంచలింగాల గుడి వద్ద త్రాగునీటి గుండాలలో అపరిశుభ్రత ప్రాంతాలను తొలగించారు మండలంలోని వంతాటిపల్లి గ్రామ సమీపాన





లంకమల అభయారణ్యంలో వెలిసిన శ్రీ నిత్య పూజ్యేశ్వర కోన పంచలింగాల గుడి వద్ద సోమవారం త్రాగునీటి గుండాలలో ఉన్న అపరిశుభ్రతను తొలగించి బ్లీచింగ్ పిచికారి చేశారు అధిక ఉష్ణోగ్రత



పట్ల భక్తులు స్వామి అమ్మ వార్ల దర్శనానికి మందకోడిగా భక్తులు కాలిబాటన నడుచుకుంటూ సన్నిదానికి వెళ్లారు సమస్యాత్మక ప్రదేశాలలో ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి ఆధ్వర్యంలో ఫారెస్ట్ సిబ్బంది అటవీ సంపద తరలిపోకుండా కూంబింగ్ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ సిబ్బంది చంద్ర ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యం శర్మ తదితరులు పాల్గొన్నారు

# మైదుకూరులో ప్రజాదర్బార్ నిర్వహించిన

## – ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



మైదుకూరు. మహి. న్యూస్. ఏప్రిల్ :27 : మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ గారు ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం -- పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రజాదర్బార్లో నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిరంతరం నిర్వహిస్తూ,



అందులో వచ్చిన ప్రతి సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలు సమర్పించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి ఆలస్యం లేకుండా సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను వినిపించారు.

# బి. మఠంలో భక్తులకు సేవా కార్యక్రమం లో

# మజ్జిగ, మంచినీళ్లు పంపిణీ చేసిన

## కానాల మల్లికార్జున రెడ్డి



బ్రహ్మంగారిమఠం:మహి. న్యూస్. ఏప్రిల్ :27: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో జరుగుతున్న బ్రహ్మంగారి 333వ ఆరాధన ఉత్సవాల్లో భాగంగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టాసుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు టీడీపీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సూచనలతో రెండో రోజు భక్తుల సౌకర్యార్థం సేవా కార్యక్రమాలు మిన్నంటాయి. కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ మరియు మంచినీళ్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎండ వేడి నుంచి ఉపశమనం కలిగించేలా ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు ఎండ తీవ్రతతో ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నిరంతరంగా రెండో రోజు కూడా విరామం లేకుండా వేల మంది భక్తులకు చల్లని మజ్జిగ, ప్యాకెట్ త్రాగునీరు పంపిణీ చేశారు. కానాల



మల్లికార్జున రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి భక్తులకు మజ్జిగ మంచినీళ్లు అందిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు సేవ చేయడం భగవంతుడికి సేవ చేయడంతో సమానమని. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడం మన బాధ్యతని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు వివిధ ప్రభుత్వ శాఖలకు సంభందించిన అధికారులు పాల్గొని




భక్తులకు చల్లని మజ్జిగ మంచినీళ్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమం లో కానాల మల్లి కార్జున రెడ్డి అనుచరులు పాల్గొని భక్తులకు సేవలందించారు. మల్లికార్జున రెడ్డి చేస్తున్న ఈ సామాజిక సేవా కార్యక్రమంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పుంజుకున్న టమోటా ధరలు..ఇక సామాన్యులకు భారమే



గాలివీడు :ఏప్రిల్27(మహి న్యూస్): సామాన్యుడి వంటింట్లో టమాటా సెగ మొదలైంది. కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే కిలో ధర రెట్టింపు కావడంతో అటు వినియోగదారులు ఆందోళన చెందుతుండగా, ఇటు మార్కెట్ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఇప్పుడు అదే టమాట డబుల్ అయింది.కిలో రూ. 40 నుండి రూ. 60కి వచ్చేస్తోంది. తక్కువ సాగు మరియు అధిక డిమాండ్ కారణంగా ఈ ధరల పెరుగుదల చోటుచేసుకుంది. ఈ పరిస్థితిలో టమాటా రైతుల జేబులు నిండుతాయా లేక దళారులకే లాభం దక్కుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆసియాలోనే అతిపెద్ద టమాటా మార్కెట్గా పేరుగాంచిన అన్నమయ్య జిల్లా మదనపల్లెలో టమాటా ధరలు ఒక్కసారిగా పుంజుకున్నాయి. సోమవారం జరిగిన వేలంలో నాణ్యమైన టమాటా కిలో గరిష్టంగా రూ.40 వరకు పలికింది. గత వారం రోజులుగా రూ.25 లోపే ఉన్న ధరలు, ఇప్పుడు అకస్మాత్తుగా పెరగడం మార్కెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. బి-గ్రేడ్ రకాలు రూ. 35 నుంచి రూ. 30 మధ్య అమ్ముడయ్యాయి. మదనపల్లె మార్కెట్కు రైతులు సుమారు 230 మెట్రిక్ టన్నుల దిగుబడిని తీసుకురాగా, వ్యాపారులు సగటున రూ. 30 నుంచి రూ. 40మధ్య కొనుగోలు చేసి ఇతర నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో దిగుబడులు తగ్గడం వల్ల మదనపల్లి టమాటాకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ధరలు ఇలా అకస్మాత్తుగా పెరగడానికి ప్రధాన కారణం రాష్ట్రంలో కొనసాగుతున్న తీవ్రమైన ఎండలు ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో బయటి ప్రాంతాల్లో టమాటా తోటలు ఎండిపోవడం టమాటా కాయ సైజు తగ్గి దిగుబడి దెబ్బతింది. ఆయా పాతాల స్థానిక మార్కెట్లలో సరఫరా తక్కువగా ఉండటంతో, ఇతర రాష్ట్రాల వ్యావారులు నాణ్యమైన సరుకు కోసం మదనపల్లి. కలకడ,గుర్రంకొండ తదితర మార్కెట్ ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇక్కడి టమాటా నాణ్యత



బాగుండటం, నిల్వ సామర్థ్యం ఎక్కువగా ఉండటంతో డిమాండ్కు తగ్గట్టుగా ధరలు కూడా వేగంగా పెరుగుతున్నాయినీ అటు రైతులు వ్యాపారస్తులు అభిప్రాయం వ్యక్త. చేస్తున్నారు. రాబోయే రోజుల్లో టమాటా ధరలు సామాన్యుడిపై భారం పెంచేలా కనిపిస్తున్నాయి. వాతావరణం చల్లబడకపోతే.. ఎండల తీవ్రత ఇలాగే కొనసాగితే, రానున్న రెండు మూడు వారాల్లో టమాటా ధరలు ఇంకా పైకి పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం హోల్సేల్ మార్కెట్లోనే రూ.40 పలుకుతుండటంతో, రిటైల్ మార్కెట్లో వినియోగదారులు అప్పుడే కిలో రూ.50- రూ 60 వరకు చెల్లించాల్సి వస్తోంది. గతేడాది లాగే టమాటా ధరలు మళ్ళీ ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.

# స్థానిక సమస్యలు మండల స్థాయిలోనే పరిష్కరించాలి..!

## వేసవిలో సీజనల్ సమస్యలపై
## ప్రత్యేక దృష్టి సారించాలి
## జిల్లా ఇంచార్జి డిఆర్వో వెంకటపతి

కడప, మహి న్యూస్ ఏప్రిల్ 27 : వేసవిలో అర్జీదారుల ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని.. క్షేత్ర స్థాయిలో సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి సారించాలని.. జిల్లా ఇంచార్జి డిఆర్వో వెంకటపతి జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ హాలులో ప్రజా ఫిర్యాదుల





పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి జిల్లా ఇంచార్జి డిఆర్వో వెంకటపతి తోపాటు పలువురు జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ వ్యవస్థ ద్వారా అర్జీదారులకు సంతృప్తి కరమైన, నాణ్యమైన వేగవంతమైన పరిష్కారాన్ని అందిస్తోందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలోనే ప్రజల సమస్యలను స్థానికంగానే గుర్తించి మండల స్థాయిలోనే పరిష్కరించేలా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వేసవి మండుటెండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన పెంచాలన్నారు. అలాగే వేసవి



కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై.. ఆయా శాఖల అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్య శాఖ, ఐసిడిఎస్ శాఖలు.. ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక దృష్టి సారించాలని, పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వేసవి తీవ్రతను అధిగమిస్తూ.. ఎక్కడా తాగునీటి కొరత లేకుండా పంచాయతీ, మున్సిపల్ శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జనగణన దేశ అభివృద్ధికి అత్యంత కీలకమైన ప్రక్రియ అని, ప్రతి పౌరుడు ఖచ్చితమైన వివరాలను సమర్పించడం ద్వారా ప్రభుత్వ పథకాల రూపకల్పనకు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు జనగణనలో సక్రమంగా పాల్గొని, సమాజ అభివృద్ధికి తోడ్పడేలా అధికారులు ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు.

### ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు..

1) ప్రొద్దుటూరు మండలం గోపవరంకు చెందిన టి. గోపాలకృష్ణ... ఎన్జీవో కాలనీకి చెందిన షేక్ అల్తాఫ్ అనే వ్యక్తి తన స్థలంను ఆక్రమించి ఇల్లు నిర్మించారని.. తన స్థలంను తిరిగి తనకు ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. 2) వియన్ పల్లి మండలం తలపనూరు గ్రామంకు చెందిన ఎన్.రామకృష్ణ.. అతని భూమికి సంబంధించిన పాస్ బుక్కులు ఇప్పించి పరిష్కరించవలసిందిగా అర్జీ సమర్పించారు. 3) కడపకు చెందిన జె. నాగ మునెమ్మ... ఇంటి పన్ను కట్టుటకు తన ఇంటిని



ఆన్లైన్ చేయ వలసిందిగా కోరుతూ అర్జీ సమర్పించారు. 4) కడప రవీంద్ర నగర్ కు చెందిన షేక్ ఇంతియాజ్ అహ్మద్.. తన ఇంటర్ మార్క్ లిస్టును బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఐ.టి. కాలేజీ నుండి ఇప్పించవలసిందిగా అర్జీ సమర్పించారు. 5) జమ్మలమడుగుకు చెందిన లక్కిరెడ్డి సాంబశివరెడ్డి.. తన స్థలాన్ని ఆన్లైన్ నందు



శివారెడ్డికి పేరుకు మార్చవలసిందిగా అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు శాంతమ్మ, శివరామిరెడ్డి, జాన్ ఇర్విన్, జెడ్పి సీఈవో రామచంద్రారెడ్డి, డిఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్ అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర చరిత్రలో చిరస్మరణీయులు.. శ్రీ రాజ వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు


## వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి
## కార్యక్రమంలో ఇన్చార్జ్ డిఆర్వో వెంకటపతి

కడప, మహి న్యూస్ ఏప్రిల్ 27 : శ్రీ రాజ వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో చిరస్మరణీయుడని, ప్రజాహితానికే అంకితమైన ఆయన సుపరిపాలన నేటి తరానికి ఆదర్శనీయం అని డిఆర్వో వెంకటపతి కొనియాడారు. సోమవారం కలెక్టరేట్ లోని సభాభవన్ లో జిల్లా సాంస్కృతిక, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మహానుభావులు శ్రీ రాజ వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్వో) వెంకటపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంకటాద్రి నాయుడు తన పాలనలో ప్రజల సంక్షేమం, ధర్మ పరిరక్షణకు విశేష





ప్రాధాన్యత ఇచ్చారని, ముఖ్యంగా దేవాలయాల నిర్మాణం, పునర్నిర్మాణం ద్వారా ఆధ్యాత్మిక విలువలను కాపాడడంతో పాటు.. సమాజంలో నైతిక పాలనను అందించారన్నారు. పరిపాలనలో క్రమశిక్షణ, న్యాయబద్ధతకు ఆయన ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. సమాజంలో శాంతి భద్రతలను నెలకొల్పేందుకు కఠిన నిర్ణయాలు తీసుకున్న నాయకుడని చెప్పారు. శ్రీ రాజ వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు 1761, ఏప్రిల్ 27వ తేదీన జగ్గ భూపతి, అచ్చమాంబ దంపతులకు జన్మించారు ఆయన సా.శ. 1413 నుండి తీరాంధ్రదేశంలోని ఒక భాగాన్ని పాలించిన వాసిరెడ్డి వంశానికు చెందినవాడు వెంకటాద్రి నాయుడు. ఈ వంశం వారందరికి చాళుక్య నారాయణ అనే బిరుదును బట్టి వీరు చాళుక్య వంశానికి చెందినవారని చరిత్రకారుల అభిప్రాయం. కృష్ణా మండలంలోని చింతపల్లి వీరి రాజధాని. కమ్మ కులానికి చెందిన వాసిరెడ్డి వంశం వారు తొలుత స్వతంత్రులైనను పిమ్మట గొల్లకొండ నవాబులకు తదుపరి బ్రిటిషు వారికి సామంతులుగా ఉన్నారు. ఆంధ్రదేశ చరిత్రలో ప్రజాహిత పరిపాలనకు మారుపేరుగా నిలిచిన గొప్ప పాలకుడని కొనియాడారు. తన పాలనలో ప్రజల సంక్షేమం, శాంతి భద్రతలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, విశాలమైన ప్రాంతాన్ని సమర్థవంతంగా పరిపాలించిన దూరదృష్టి గల నాయకుడన్నారు. అందుకు ప్రత్యక్ష నిదర్శనం.. అమరావతి నగర నిర్మాణం, అభివృద్దే అన్నారు. అమరావతి పట్టణ నిర్మాణం ఆయన పరిపాలనా ప్రతిభకు నిదర్శనమని, ఆధునిక నగర రూపకల్పనలో కూడా ఆయన ముందుచూపు స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు. దేవాలయాల నిర్మాణం, పునరుద్ధరణ ద్వారా ధార్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంలో ఆయన పాత్ర అపారమని అన్నారు. ముఖ్యంగా అమరేశ్వర స్వామి ఆలయం అభివృద్ధికి చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని వివరించారు. కృష్ణా జిల్లా ప్రాంతమందు 108 దేవాలయాలు కట్టించాడు. 1807-వీటిలో అమరావతి, చేబ్రోలు, పొన్నూరు, మంగళగిరి ముఖ్యమైనవి. అమరావతి లోని అమరేశ్వర దేవాలయం పునర్మించి దేవాలయానికి పెక్కు హంగులు చేసి తొమ్మిదిమంది అర్చకులను నియమించి ఒక్కొక్కరికి 12 ఎకరాలు భూమి ఇచ్చాడు. 09లో మంగళగిరి నరసింహ స్వామి దేవాలయానికి 11 అంతస్తుల గాలి గోపురాన్ని నిర్మించాడు. ఇది 15 మీటర్లు (49 అడుగులు) వెడల్పు, 46.7 మీటర్లు (153 అడుగులు) ఎత్తు కలిగి దేశంలో ఉన్న రాజ గోపురాలలో ద్వితీయ స్థానంలో ఉంది.1803 లో బాపట్ల లోని భావన్నారాయణ స్వామి చతుర్ముఖాలయం ఆలయానికి భూదానం చేసాడు. చేబ్రోలులో నిర్మించాడు. గుంటూరు రామచంద్ర అగ్రహారంలోని మల్లీశ్వరస్వామికి భూదానం చేసినట్లు 1193 ఫసలిలో ఉందన్నారు. అలాగే, పిండారీ దండులను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు రక్షణ కల్పించిన ధైర్యవంతుడని, పరిపాలనలో క్రమశిక్షణకు ప్రాముఖ్యత ఇచ్చిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన చేపట్టిన సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వేంకటాద్రి నాయుడు తన శేషజీవితం అమరేశ్వరుని పాదాలకాడ గడిపారని.. ఆయన 1817, ఆగష్టు 17 న మరణించినట్లు చరిత్ర రికార్డులు చెబుతున్నాయన్నారు. ఇలాంటి మహనీయుల జీవితాలను నేటి తరాలకు పరిచయం చేయడం అవసరమని, వారి స్ఫూర్తితో సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వెంకటాద్రి నాయుడు చేసిన సేవలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన మార్గంలో నడుచుకుంటూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత ముఖ్యంగా చరిత్రలోని మహనీయుల జీవితం, వారి సేవలను తెలుసుకొని దేశాభివృద్ధికి దోహదపడాలని సూచించారు. కార్యక్రమంలో ముందుగా జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్వో) వెంకటపతి తోపాటు పలువురు అధికారులు శ్రీ వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జీవిత విశేషాలను వివరిస్తూ ప్రసంగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు శాంతమ్మ, శివరామిరెడ్డి, జాన్ ఇర్విన్, జెడ్పి సీఈవో రామచంద్రారెడ్డి, డిఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్, స్టెప్ మేనేజర్ సుబ్బారాయుడు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువత తదితరులు హాజరయ్యారు.



# ఇంధన సరఫరాలో తాత్కాలిక రేషనలైజేషన్ విధానం అమలు..!

## జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి
## జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసీ డా. నిధి మీనా లతో కలిసి పాత్రికేయుల సమావేశం
## జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఫోన్: 08562-246344 ఏర్పాటు

కడప, మహి న్యూస్ ఏప్రిల్ 27 : జిల్లాలో ఇటీవల పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఏర్పడిన అంతరాయాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు సమానంగా, నిరంతరంగా ఇంధనం అందించేందుకు తాత్కాలిక రేషనలైజేషన్ విధానం అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో.. జిల్లాలో ఇంధన సరఫరాపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసీ డా. నిధి మీనా లతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు అయిన ×ూజూ, ూజూ, దీూజూ, నయారా, రిలయన్స్ సంస్థలకు చెందిన పలు రిటైల్ అవుట్లెట్లలో ఇంధనం కొరత ఏర్పడటం జరిగిందన్నారు. ఇంధన సరఫరాలో ఏర్పడిన అంతరాయాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు సమానంగా, నిరంతరంగా ఇంధనం అందించేందుకు ఇంధన సరఫరాలో రేషనలైజేషన్ విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 242 పెట్రోల్ బంకులు ఉండగా, వీటికి వివిధ డిపోల నుంచి ట్యాంకర్ లారీల ద్వారా సరఫరా జరుగుతోందన్నారు. అయితే గ్లోబల్ స్థాయిలో క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడంతో బల్క్ వినియోగదారులు రిటైల్ బంకులపై ఆధారపడటం పెరిగిందన్నారు. దీని వల్ల కొద్దిసమయంలోనే కొన్ని బంకులలో డీజిల్ పూర్తిగా అయిపోవడం,



తద్వారా సరఫరా జాప్యం ఏర్పడి ఇతర బంకులపై ఒత్తిడి పెరగడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఎచ్పీసీఎల్ కు చెందిన 95 బంకుల్లో 31 బంకులు, ఐఓసీఎల్ కు చెందిన 67 బంకుల్లో 17 బంకులు, బీపీసీఎల్ కు చెందిన 63 బంకుల్లో 19 బంకులు, ఎస్సార్/నయారా సంస్థకు చెందిన 14 బంకుల్లో 3 బంకులు, రిలయన్స్కు చెందిన 3 బంకుల్లో 1 బంకులో నిల్వలు లేకపోవడం గమనార్హం అన్నారు. మొత్తం 242 బంకుల్లో 71 బంకుల్లో ఇంధన కొరత ఉన్నట్లు అధికారులు గుర్తించారన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాధారణ వినియోగానికి 10 శాతం అదనంగా ఇంధన సరఫరా చేయాలని ఆయిల్ కంపెనీలను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే రెవెన్యూ డివిజనల్ అధికారుల ఆధ్వర్యంలో ప్రతి పెట్రోల్ బంక్పై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి, సరఫరా మరియు అమ్మకాలపై నిఘా ఉంచుతున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ (ఫోన్: 08562-246344) ఏర్పాటు చేయగా, ప్రతి ఆయిల్ కంపెనీకి ఉప కలెక్టర్లను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించి సమన్వయం కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఇంధన సరఫరా సమానంగా జరిగేలా తాత్కాలికంగా "రేషనలైజేషన్" విధానం అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ విధానం ప్రకారం మూడు చక్రాల ప్యాసింజర్ ఆటోలకు ఎలాంటి పరిమితి లేకుండా డీజిల్ అందించనుండగా, కార్లు మరియు చిన్న సరుకు వాహనాలకు గరిష్టంగా 30 లీటర్లు, ప్రైవేట్ బస్సులు మరియు సరుకు రవాణా లారీలకు 100 లీటర్లు, వరికోత యంత్రాలకు 80 లీటర్ల వరకు మాత్రమే డీజిల్ ఇవ్వాలని నిర్ణయించారన్నారు. అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా అంబులెన్స్లు, ప్రజా రవాణా వాహనాలు, నీరు మరియు పాలు ట్యాంకర్లు, గ్యాస్ సిలిండర్ సరఫరా వాహనాలకు నిరంతర ఇంధన సరఫరా కొనసాగుతుందని స్పష్టం చేశారు. వ్యవసాయ అవసరాల కోసం డీజిల్ సరఫరా తహసీల్దార్ల సిఫార్సు మేరకు అనుమతించబడుతుందని తెలిపారు. ఇకపై పెట్రోల్ బంకుల వద్ద బాటిల్స్, క్యాన్లు, డ్రమ్స్లో ఇంధనం నింపడం పూర్తిగా నిషేధించబడిందని హెచ్చరించారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు అవసరానికి మించి ఇంధనం నిల్వ చేయకుండా ప్రభుత్వ చర్యలకు సహకరించాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా అక్రమాలు జరుగుతున్నట్లు గమనిస్తే, వదంతులు ఉంటే వెంటనే జిల్లా కలెక్టరేట్లోని కంట్రోల్ రూమ్కు ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. పెట్రోలియం చట్టం కింద లైసెన్స్ లేకుండా ఇంధనాన్ని నిల్వ చేయడం నేరం అని, భారీ పరిమాణంలో ఇంధనాన్ని కొనుగోలు చేసే వారిపై కమర్షియల్ టాక్స్ విభాగం ద్వారా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ మరియు పెట్రోలియం యాక్ట్, జీఎస్టీ యాక్ట్ వంటి చట్టాల కింద కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు మరియు వాహనదారులు తదితర వినియోగదారులు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు.



EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com